

వన్‌టౌన్ పరిధిలోని ఓ ఇంట్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

రౌడీ షీటర్ల ఇళ్లలో సోదాలు

తుపాకీ కాల్పుల ఘటన నేపథ్యంలో పోలీసులు అలర్ట్

- 525 మంది 103 బృందాలుగా ఏర్పడి తనిఖీలు
- కత్తులు, గంజాయి, లెక్కలు చూపని నగదు స్వాధీనం

మహారాణిపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):


నగరంలో రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల ఇళ్లలో పోలీసులు మంగళవారం పకడ్బందీగా సోదాలు (కార్డన్ సెర్చ్) నిర్వహించారు. వన్‌టౌన్‌లో ఆదివారం అర్ధరాత్రి తుపాకీ కాల్పులు జరగడంతో నగరవాసులతో పాటు పోలీసులు ... మిగతా 6వ పేజీలో



ఇళ్లలో సోదాలు చేస్తున్న దృశ్యం

తగ్గుతున్న ఉక్కు ఉత్పత్తి

కన్వేయర్ల నిర్వహణలో వైఫల్యమే కారణం



- అనుభవం కలిగిన కాంట్రాక్టు కార్మికులను తొలగించి అవగాహన లేని వారి నియామకం
- దాంతో రా మెటీరియల్ విభాగం నుంచి ఆయా విభాగాలకు సరిగా చేరని ముడి పదార్థాలు
- వారం రోజుల నుంచీ ఇదే పరిస్థితి
- మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా గతంలో రోజుకు 21 వేల టన్నుల స్టీల్ ఉత్పత్తి
- ప్రస్తుతం 17,056 టన్నులే...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో ఉత్పత్తి క్రమంగా తగ్గిపోతోంది. పూర్తి సామర్థ్యంతో ప్లాంటును నడిపితేనే లాభాలు వస్తాయని చెబుతూ మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను ఆగమేఘాలపై ఉత్పత్తికి సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు వాటికి అవసరమైన ముడి పదార్థాలు పూర్తిగా అందించలేకపోతున్నారు.

ప్రస్తుత సీఎండీ ఉత్పత్తి వ్యయం తగ్గించాలని 4,500 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారు. కన్వేయర్ల నిర్వహణలో అనుభవం కలిగిన కాంట్రాక్టు వర్కర్లను తీసేసి, వారి స్థానంలో ఏమీ తెలియని ఒడిశా వర్కర్లను పెట్టారు. దాంతో రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు నుంచి అవసరమైన మేరకు ముడి పదార్థాలు కన్వేయర్ల ద్వారా ఆయా విభాగాలకు చేరడం లేదు. సింటర్ తయారీ 70 శాతం పడిపోయింది. దాంతో బ్లాస్ట్ ఫర్నేస్‌లు పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయలేకపోతున్నాయి. మూడూ కలిసి పనిచేస్తే రోజుకు 21 వేల టన్నుల స్టీల్ తయారవుతుంది. మొదట్లో లక్ష్యం సాధించాలని తీవ్ర ఒత్తిడి పెట్టడంతో అంతా శక్తికి మించి, విరామం కూడా తీసుకోకుండా 21 వేల టన్నులు తీశారు. కానీ గత వారం రోజుల నుంచి పరిస్థితి మారిపోయింది. ఈ నెల 16వ తేదీన మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా 18,023 టన్నులే వచ్చింది. 17వ తేదీన ఉత్పత్తి 17,577కు ... మిగతా 6వ పేజీలో

పెరిగిన ఉత్పత్తి వ్యయం

గత ఏడాది ఏప్రిల్‌లో గంగవరం పోర్టులో కార్మికులు సమ్మె చేయడంతో అక్కడి నుంచి ఐరన్‌ఓర్, కోల్ సరఫరా ఆగిపోయింది. ఆ ప్రభావం ఉత్పత్తిపై పడింది. 2024 ఏప్రిల్‌లో 2.61 లక్షల టన్నుల స్టీల్ తయారు చేయగా, ఉత్పత్తి వ్యయం టన్నుకు రూ.64,500 పడింది. అప్పుడు రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లే పనిచేసేవి. గత ఏడాది సెప్టెంబరులో ముడి పదార్థాల కొరత తీవ్రం కావడంతో ఆ నెల ఉత్పత్తి 1.36 లక్షల టన్నులకు పడిపోయింది. ఆ నెల టన్నుకు వ్యయం రూ.85,900 పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం చేయడంతో ఈ ఏడాది మే నెలలో రెండు బ్లాస్ట్‌ఫర్నేస్‌ల ద్వారా 3.76 లక్షల టన్నులు వచ్చింది. ఉత్పత్తి వ్యయం రూ.48,760 పడింది. జూన్ నెలలో 3.74 లక్షల టన్నులు తీయగా ఉత్పత్తి వ్యయం రూ.49,559 పడింది. జూలైలో (గత నెల) మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు పనిచేయడంతో 4.36 లక్షల టన్నుల ఉత్పత్తి వచ్చింది. అంటే ఉత్పత్తి వ్యయం తగ్గాలి. కానీ గత నెలలాగే టన్నుకు రూ.49,300 పడింది. అంటే యాజమాన్యం ఉత్పత్తి పెరిగినా వ్యయం తగ్గించలేకపోతోంది. దొడ్డిదారిన ఒప్పందాలు చేసుకొని పెల్లెట్లు, కోక్‌ఓవెన్ కొనడం వల్లే ఇలా జరుగుతోందని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై కేంద్ర సంస్థలు దర్యాప్తు చేయాల్సి ఉంది.



క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటు చేయనున్న భవనం

కేజీహెచ్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్

మార్చురీ ఎదురుగా నిర్మాణం

- రూ.23.75 కోట్లు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం
- రూ.7.12 కోట్లతో అత్యాధునిక పరికరాల కొనుగోలు
- అక్టోబరు నెలాఖరు నాటికి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు యత్నం

విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):

కేజీహెచ్‌లో మరో అత్యాధునిక వైద్య సేవల కేంద్రం ప్రారంభం కాబోతోంది. ఆస్పత్రి ఆవరణలోని మార్చురీ ఎదురుగా రూ.23.75 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం క్రిటికల్ కేర్ బ్లాక్‌ను నిర్మించింది. అందులో అవసరమైన పరికరాల కొనుగోలుకు మరో రూ.7.12 కోట్లు వెచ్చిస్తోంది. ఇప్పటికే భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది అక్టోబరు చివరి నాటికి ఈ బ్లాక్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఆరోగ్య శాఖ అధికారులు నిర్ణయించారు. ఆస్పత్రిలో ఉన్న ఐసీయూ విభాగాలన్నింటినీ అందులోకి తరలించనున్నారు. అలాగే, ప్రాణాపాయ పరిస్థితుల్లో ఆస్పత్రిలో చేరిన రోగులకు అక్కడే వైద్యం అందిస్తారు.

దేశంలోని అనేక రాష్ట్రాలకు కేంద్రం క్రిటికల్ కేర్ సెంటర్లను మంజూరుచేసింది. అందులో ఒకటి కేజీహెచ్‌లో ఏర్పాటైంది. ఆ బ్లాక్‌లో క్రిటికల్ కేర్ వైద్య సేవలకు సంబంధించి ప్రత్యేకంగా 50 పడకలతో వార్డు ఏర్పాటుచేస్తారు. అలాగే, మూడు అంతస్థులను ఐసీయూ విభాగాలకు కేటాయించనున్నారు. ఈ బ్లాక్‌లో వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేకంగా వైద్య సిబ్బందిని, నిపుణులను నియమించనున్నారు.

ఈ సమస్యలకు చికిత్స

గుండెపోటు, శ్వాసకోశ వైఫల్యం, తీవ్రమైన గాయాలైన వారికి ఇక్కడ వైద్య సేవలు అందిస్తారు. 24 గంటలూ నిపుణులైన వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు.

అత్యాధునిక పరికరాలు

ఈ సెంటర్‌లో వైద్య సేవలు అందించేందుకు అనుగుణంగా రూ.7.12 కోట్లతో అత్యాధునిక వైద్య పరికరాలను ఆరోగ్య శాఖ అధికారులు కొనుగోలు చేయనున్నారు. ఇప్పటికే కేంద్రం ... మిగతా 6వ పేజీలో

పొంచి ఉన్న వ్యాధులు

వర్షాలతో మారిన వాతావరణం

- ఎక్కడికక్కడ నీరు నిల్వ...దోమల వ్యాప్తికి అవకాశం
- తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే మలేరియా, చికున్ గున్యా, డెంగ్యూ వంటి వ్యాధుల బారినపడే ప్రమాదం
- కాచి చల్లార్చిన నీటినే తాగాలి

విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):



జిల్లాలో కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు తాజాగా కురిసిన వర్షాలు కొంతవరకూ ఉపశమనం కలిగించాయి. అయితే, ఇప్పుడే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మారిన వాతావరణ పరిస్థితులు, వర్షాలతో ఎక్కడికక్కడ నీరు చేరిన నేపథ్యంలో అనేక రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

వర్షాలు పడుతున్నప్పుడు తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, ఆ నీటిని తీసుకోవడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు. బయట ఎక్కడపడితే అక్కడ గానీ, ఇంట్లో కుళాయి ద్వారా వచ్చే నీటిని గానీ తగిన జాగ్రత్తలు పాటించకుండా తాగడం వల్ల టైఫాయిడ్, గ్యాస్ట్రైటిస్, పచ్చకామెర్లు వంటి బారినపడే ప్రమాదం ఉందంటున్నారు. అందువల్ల ప్రజలు తాగునీటి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కాచి, చల్లార్చిన ... మిగతా 6వ పేజీలో

సెప్టెంబరు 5 నుంచి వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్

- వీఎంఆర్‌డీఏ పార్కు వెనుకనున్న ఎంజీఎం మైదానంలో నిర్వహణ

విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):



సెప్టెంబరు 5, 6, 7 తేదీల్లో వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో మంగళవారం దీనిపై సమావేశం నిర్వహించారు. పర్యాటక శాఖ అధికారులు, హోటళ్ల నిర్వాహకులు పలు సూచనలు చేశారు. ఆర్కే బీచ్‌రోడ్డులో వీఎంఆర్‌డీఏ పార్కు వెనుకనున్న ఎంజీఎం మైదానంలో ఆ మూడు రోజులు సాయంత్రం ఐదు నుంచి రాత్రి 10.30 గంటల వరకు ఫుడ్ ఫెస్టివల్ ఉంటుంది. పర్యాటకులను ఆకర్షించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని స్టార్ హోటళ్లు ఇందులో పాల్గొంటాయని, చెఫ్‌లకు పోటీలు కూడా నిర్వహిస్తామని హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అధ్యక్షులు విజయమోహన్, హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధి పవన్ కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానంలో చేతివాటం!

ఆలయాల్లో అధికారుల కక్కుర్తి

- నెలవారీ కమీషన్ల డిమాండ్
- ఆహారంలో తగ్గిపోతున్న నాణ్యత
- మారుతున్న లెక్కలు
- ప్రసాదాలపైనా ఆ ప్రభావం
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



నగరంలోని ప్రధాన ఆలయాల్లో కొందరు అధికారులు ప్రతి దాంట్లోను కమీషన్లు ఆశిస్తున్నారు. ముఖ్యంగా నిత్యాన్నదానం సెక్షన్ నుంచి నెలకు కనీసం లక్ష రూపాయలకు తక్కువ లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేసి తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ఆ విభాగంలో లెక్కలు మారిపోతున్నాయి. భక్తులకు పెట్టే భోజనంలో రుచి తగ్గిపోతోంది. నాణ్యమైన సరకులు కొనుగోలు చేయలేకపోతున్నారు. అన్నానికి ఉపయోగించే బియ్యం మారిపోతున్నాయి. సాంబారు పలచగా మారిపోతోంది. ప్రతిరోజు పెట్టాల్సిన స్వీటు కొన్ని రోజులు కనిపించకుండా పోతోంది.

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతి ప్రధాన ఆలయంలో తప్పనిసరిగా భక్తులకు అన్నదాన పథకం అమలు చేయాలని ఆదేశించింది. దీంతో అన్నదానానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్నదంటూ కొందరు బడ్జెట్ పెంచుకుంటూ పోతున్నారు. దానికి తగ్గట్టు ఏర్పాట్లు మాత్రం ఉండడం లేదు. సింహాచలం దేవస్థానంలో రోజుకు సగటున మూడు వేల మంది భక్తులకు అన్నదానం చేస్తారు. వారాంతాల్లో ఆ సంఖ్య ఐదు వేలకు చేరుతుంది. అక్కడ కొండపై ఎంతమంది భక్తులు వచ్చారో లెక్క తెలుసుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానం ఉంది. అంటే అన్నదాన సత్రానికి వచ్చే వారి దగ్గర బయోమెట్రిక్ తీసుకుంటారు. దీనిని బట్టి ఏ రోజు ఎంత మంది వచ్చారో తెలుస్తుంది. నగరంలో అన్నదానం నిర్వహించే ఓ ఆలయంలో ఆ ఏర్పాట్లు లేవు. మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల మధ్య ఎంత మంది భక్తులు వస్తే అంత మందికి భోజనం కూపన్లు ఇస్తారు. సిబ్బంది చూపించేదే లెక్క. దీనివల్ల భక్తుల సంఖ్యలో తేడాలు చూపించడానికి అవకాశం కలుగుతోంది.

సాధారణంగా ఆలయ ఉన్నతాధికారులు నెలకు ఇంత కావాలని డిమాండ్ చేసి తీసుకున్న సందర్భాలు లేవు. ఇటీవల కాలంలోనే ఈ దుష్ట సంస్కృతి మొదలైందని చెబుతున్నారు. 'మీరు ఏమి చేసుకుంటారో మాకు అనవసరం. నెల అయ్యేసరికి లక్ష రూపాయలు ఇవ్వాల్సిందే' అని ఒత్తిడి పెట్టడంతో ఆ మొత్తం సమకూర్చడానికి సిబ్బంది అడ్డదారులు తొక్కుతున్నారు. అది ఒక లక్ష రూపాయలతో ఆగడం లేదు. ఆ విభాగంలో పనిచేస్తున్నవారు పంచుకోవడానికి మరికొంత మిగుల్చుకుంటున్నారు. దాంతో అన్నదానంలో ... మిగతా 6వ పేజీలో

ఏయూలో డిఫెన్స్ కోర్సులకు బ్రేక్?

సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ ఆధ్వర్యంలో పలు కోర్సుల నిర్వహణ

- ఈ ఏడాదికి షెడ్యూల్ విడుదల చేయని డీజీఆర్ అధికారులు
- కారణాలపై స్పష్టత లేని వైనం
- ఈ కోర్సుల ద్వారా వర్సిటీకి ఏటా రూ.4 కోట్ల వరకు ఆదాయం



విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం డిఫెన్స్ స్టడీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొన్ని కోర్సులకు ఈ ఏడాది అనుమతి లభించలేదు. డిఫెన్స్ స్టడీస్ ఆధ్వర్యంలో 2017 నుంచి ఇండియన్ నేవీ, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల కోసం వివిధ రకాల కోర్సులను నిర్వహిస్తున్నారు. వీటి నిర్వహణకు అవసరమైన ఫీజులు, ఇతర ఖర్చులను మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్, డిపార్టుమెంట్ ఆఫ్ ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ (డీఈఎస్‌డబ్ల్యు) ఆధ్వర్యంలోని డైరెక్టర్ జనరల్ రీసెటిల్‌మెంట్ (డీజీఆర్) చెల్లిస్తోంది. కోర్సుల నిర్వహణకు అనుగుణమైన షెడ్యూల్‌ను డీజీఆర్ అధికారులే ఏయూలోని డిఫెన్స్ స్టడీస్‌కు అందిస్తుంటారు.

కొన్ని కోర్సులకు సంబంధించిన షెడ్యూల్ ఈ ఏడాది మార్చితో పూర్తయింది. కొత్త బ్యాచ్‌లకు షెడ్యూల్ విడుదల చేయకపోవడంతో చర్చ జరుగుతోంది. షెడ్యూల్‌ను ఎందుకు ఇవ్వలేదన్న దానిపై వర్సిటీ అధికారులకు కూడా సమాచారం లేదు. ఈ కోర్సుల నిర్వహణ ద్వారా ఏయూకు ఏటా మూడు నుంచి నాలుగు కోట్ల రూపాయలు ఆదాయం వస్తోంది. మొత్తంగా ఏడు కోర్సులు నిర్వహిస్తుండగా, ఏడాదికి 12 నుంచి 14 బ్యాచ్‌లు రిలీవ్ అవుతుంటాయని, ఒక్కో బ్యాచ్‌లో 35 నుంచి 50 మంది ఉద్యోగులు/రిటైర్డ్ ఉద్యోగులు ఉంటారని అధికారులు చెబుతున్నారు. ఆయా బ్యాచ్‌లకు బోధించే ... మిగతా 6వ పేజీలో

ఆర్ఈసీఎస్‌పై విచారణకు మోకాలడ్డు?

ఇక్కడ కొందరు ఉద్యోగులు చేస్తున్న ప్రయత్నాలకు విజయవాడ అధికారి సహాయ సహకారాలు

- అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సరఫరా సంఘానికి గతంలో పర్సన్ ఇన్‌చార్జిగా పనిచేసిన సదరు అధికారి
- ఆయన హయాంలోనే అనేక అవకతవకలు చోటుచేసుకున్నట్టు ఆరోపణలు
- అవన్నీ బయటపడతాయనే విచారణను అడ్డుకునేందుకు యత్నం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సరఫరా సంఘం (ఆర్ఈసీఎస్)లో అక్రమాలపై విచారణ ముందుకు సాగకుండా విజయవాడలోని ఓ ఉన్నతాధికారి అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం సహకార శాఖలో పనిచేస్తున్న ఆయన...గతంలో ఆర్ఈసీఎస్‌కు కొన్నాళ్లు పర్సన్ ఇన్‌చార్జిగా పనిచేశారు. ఆ సమయంలో చేతివాటం ప్రదర్శించారనే ఫిర్యాదులు ఉన్నాయి. హుద్‌హుద్ సమయంలో ఆయన ఇక్కడే ఉన్నారు. తుఫాన్ గాలులకు విద్యుత్ వ్యవస్థ సమూలంగా నాశనం కావడంతో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ వైర్లు వంటివి పెద్ద మొత్తంలో కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఆర్ఈసీఎస్‌లో విద్యుత్ పరికరాల కొనుగోళ్లకు ఎటువంటి టెండర్ల విధానం పాటించడం లేదు. ఐదు లక్షల రూపాయలు, అంతకంటే ఎక్కువ మొత్తం అయితే టెండర్ పిలవాలి. కానీ ఆ నిబంధనను తుంగలో తొక్కి నామినేషన్ పద్ధతిపైనే నచ్చిన వారితో కొనిపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఆయన అస్మదీయ సంస్థల నుంచి కోట్ల రూపాయల పరికరాలు కొనుగోలు చేయించారు. ఆర్ఈసీఎస్‌లో నిధుల స్వాహాకు అధికారులు కొన్ని అడ్డగోలు పనులుచేసేవారు. కోటి రూపాయల పరికరాలు అవసరమైతే రెండు కోట్ల రూపాయలు అవసరమని ఫైల్ పెట్టి, డబ్బులు మంజూరు చేసేవారు. సరకు మాత్రం కోటి రూపాయలకే వచ్చేది. బిల్లు రెండు కోట్లు చెల్లించినట్టు చూపించేవారు. ఆ అదనపు కోటి రూపాయలు అధికారులు, సిబ్బంది దిగమింగేవారు. ఇప్పుడు ... మిగతా 6వ పేజీలో

సింహాద్రినాథునికి స్వర్ణ తులసీ దళార్చన



సింహాచలం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా మంగళవారం స్వరతులసీ దళార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ తులసీ దళాలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ జరిపారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని, ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టంపజేశారు.భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామాలను పఠిస్తూ స్వర్ణ తులసీ దళాలతో పూజలు చేశారు. తరువాత అదే వేదికపై పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో నిత్య కల్యాణం జరిపారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. 1 లక్ష విరాళం

సింహాచలం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని శంకర మఠానికి చెందిన పి. రాంబాబు, సుగుణ దంపతులు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చెక్ రూపంలో దేవాలయ ప్రజా సంబంధాల విభాగం పర్యవేక్షణాధికారి వెంకటేశ్వరరావుకు మంగళవారం వారు అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించారు. అలాగే స్వామివారికి నిత్యం జరిగే పలు వైదిక సేవల్లో వినియోగించాలని కోరుతూ అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన ఎంవై సుబ్రహ్మణ్యం రజిత తీర్థ పాత్రను బహూకరించారు. సుమారు 1. 264 కిలోల బరువు ఉన్న ఈ పాత్రను మంగళవారం ఆయన దేవస్థానం డిప్యూటీ ఈఓ సింగం రాధ, ఏఈఓ తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి త్రిమూర్తులకు అందజేశారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

తగరపువలస, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డా. పి. శ్రీవాణి తెలిపారు. మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. బీఏ హిస్టరీ, పొలిటికల్ సైన్స్, బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్, బీఎస్సీలో బోటనీ, జూవాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్‌మ్యాథ్‌మేటిక్స్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పూర్తి వివరాలకు 89978883125, 8522975829 సెల్ నంబర్లను సంప్రతించాలని ఆమె సూచించారు.

రాసపోలమ్మకు తులసీ దళాలతో అలంకరణ



భీమునిపట్నం (రూరల్),ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మజ్జివలస రాసపోలమ్మ అమ్మవారిని తులసీ దళాలతో అలంకరించారు. ప్రతి వారం ఒకో విధమైన అలంకరణతో అమ్మవారిని తయారు చేస్తుంటారు. ఈమేరకు మంగళవారం తులసీ దళాలతోఅలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సందీప్‌కు జనసేన నాయకుల అభినందనలు

మధురవాడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్‌ను మధురవాడ నాయకులు అభినందించారు. ఈమేరకు మంగళవారం ఏడో వార్డు అధ్యక్షుడు నాగోతి నరసింహనాయుడు ఆధ్వర్యంలో తిరుమలరావు, సతీశ్, విజయపాత్రుడు, త్రినాథ్ తదితరులు సందీప్ నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం ఇచ్చారు. అలాగే నగరాల కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమలేష్‌ను కూడా జనసేన నాయకులు సత్కరించారు.

ఐదో వార్డు సమస్యలపై వినతి

కొమ్మాది, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 5వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈమేరకు ఆమె మేయర్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. శివశక్తి నగర్ నుంచి మారికవలస ఐటీ సెజ్ రోడ్డుకు కల్వర్టు, రోడ్డు వేయాలని, బోరవానిపాలెం గ్రామానికి ప్రధాన రహదారి, కాలువ నిర్మించాలని విన్నవించారు. అలాగే బొట్టవానిపాలెం చెరువును ఆధునికీకరించాలని, మారికవలస పార్కును అభివృద్ధి చేయాలని, మారికవలస నుంచి ఐటీ సెజ్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు.

పద్మనాభంలో 117 దివ్యాంగ పింఛన్లు రద్దు

పద్మనాభం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 40 శాతం లోపు అంగవైకల్యం కలిగిన 117 మంది దివ్యాంగుల పింఛన్లను అధికారులు రద్దు చేశారు. వీటిలో 95 పింఛన్లు పూర్తిగా తొలగించగా 22 మందికి వారి వయస్సు మేరకు వృద్ధాప్య పింఛన్లుగా మార్పు చేశారు. పింఛన్లు రద్దయి అనర్హులుగా నోటీసు అందుకున్న వారు తాము అర్హులమని భావించినట్లయితే ఎంపీడీఓను కలిసి అప్పీలు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పెన్షన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, నిర్దేశించిన షెడ్యూలు తేదీల్లో జిల్లా ఆసుపత్రికి తనిఖీ నిమిత్తం పంపిస్తారు. అక్కడ అన్నీ సక్రమంగా ఉంటే పింఛను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.

అర్చక క్వార్టర్లు తొలగింపు

భీమునిపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మెయిన్ రోడ్‌ను ఆనుకుని శివ, కేశవ ఆలయ సముదాయంలో ఉన్న అర్చక క్వార్టర్లను ఎండోమెంట్ శాఖాధికారులు తొలగిస్తున్నారు. పురాతనమైన ఈ క్వార్టర్లు శిథిల స్థితికి చేరి నివశించడానికి అనుకూలంగా లేవు. మొత్తం ఆరు క్వార్టర్లలో రెండింటిని తొలగిస్తున్నామని శివ, కేశవ ఆలయాల సముదాయం సింగిల్ ట్రస్టీ రొంపిచెర్ల సింగరాచార్యులు తెలిపారు.

ఏయూలో డిఫెన్స్ కోర్సులకు బ్రేక్?

... 5వ పేజీ తరువాయి

పాఠాల సమయాన్ని బట్టి (గంటలు) ఫీజులు చెల్లిస్తుంటారు.

ఇవీ కోర్సులు..

ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు (పదవీ విరమణ చేయడానికి కొద్దినెలల ముందు), పదవీ విరమణ చేసిన కొందరు ఉద్యోగులకు డీజీఆర్ ఆయా కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తోంది. దీనివల్ల ఉద్యోగ విరమణ తరువాత వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించాలన్నది ఉద్దేశం. ఈనేపథ్యంలో 2017 నుంచి కొన్ని రకాల కోర్సులను నిర్వహించేలా ఏయూతో ఒప్పందం చేసుకుంది. ప్రస్తుతం యోగా ఇన్‌స్ట్రక్టర్, మెరైన్ ఇంజనీరింగ్, మెరైన్ ఎలక్ట్రికల్ అండ్ నావిగేషన్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ రోబోటిక్స్, ఫైర్ అండ్ ఇండస్ట్రియల్ సేఫ్టీ ఇంజనీరింగ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వంటి కోర్సులను నిర్వహిస్తున్నారు. ఆయా కోర్సుల కాల వ్యవధి మూడు నుంచి ఆరు నెలలు ఉంటుంది.

కొరవడిన స్పష్టత..

ఇప్పటివరకూ కొన్ని వందల మంది డిఫెన్స్‌కు చెందిన ఉద్యోగులు ఇక్కడ కోర్సులు పూర్తిచేశారు. కరోనా సమయంలో మినహా కోర్సుల నిర్వహణలో అంతరాయం ఏర్పడలేదు. తొలిసారి డీజీఆర్ నుంచి కోర్సుల నిర్వహణపై సమాచారం వర్సిటీ అధికారులకు రాలేదు. సాధారణంగా కోర్సులు నిర్వహిస్తుండగానే తదుపరి కోర్సుల కొనసాగింపునకు సంబంధించిన సమాచారం, ఆయా కోర్సుల్లో చేరే వారి జాబితా చేరుతుంది. ఈ ఏడాది మార్చితో కోర్సులు పూర్తయినప్పటికీ, ఇప్పటివరకూ తదుపరి కోర్సుల్లో చేరే వారి జాబితా, షెడ్యూల్ రాకపోవడంతో సందిగ్ధం నెలకొంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

గంభీరం గెడ్డపై వంతెన నిర్మాణం

- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్
- ఆరు గ్రామాలకు తీరనున్న కష్టాలు



పాత పరదేశిపాలెం వంతెనను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

భీమునిపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాలుగో వార్డు పాత పరదేశిపాలెం వంతెనను జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. వర్షాకాలం, తుఫాన్ల సమయంలో గంభీరం గెడ్డ ర్యాంప్‌పై నుంచి నీరు పొంగిపొర్లుతుండడంతో పాతపరదేశిపాలెం, కాపులుప్పాడ, ఎస్సీ కాలనీ, జగనన్న కాలనీ, రెడ్డీలపాలెం, సోమన్నపాలెం గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. ఈ విషయమై స్థానిక నాయకులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన తగిన చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ఈమేరకు కమిషనర్ ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ర్యాంప్‌ను పరిశీలించారు. గతంలో ఈ ర్యాంప్‌ను పంచాయతీరాజ్ శాఖ నిర్మించి ఆర్‌అండ్‌బీకి అప్పగించారని అధికారులు తెలిపారు. ప్రస్తుతం సుమారు 75 నుంచి 80 మీటర్ల పొడవున్న ఈ ర్యాంప్ స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసే విషయమై ఇరు శాఖల ఇంజనీరింగ్ అధికారులతో ఆయన చర్చించారు. భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ర్యాంప్ స్థానంలో నూతన వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేసి నివేదించాలని జీవీఎంసీ, ఆర్‌అండ్‌బీ శాఖల ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోన్ వన్, జోన్ టూ కమిషనర్లు వి. అయ్యప్పనాయుడు, కె. కనకమహాలక్ష్మి, ఆర్‌అండ్‌బీ పర్యవేక్షక ఇంజనీరు జాన్స్ సుధాకర్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాసరావు, జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీర్ వాసు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీరామ్మూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామకృష్ణ, సహాయక ఇంజనీరు సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- జిల్లా పరిషత్ సీఈఓ నారాయణమూర్తి



అధికారులతో మాట్లాడుతున్న సీఈఓ నారాయణమూర్తి

ఆనందపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీల్లోని పాలకులు, అధికారులు గ్రామాల్లో పారిశుధ్యం పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి పి. నారాయణమూర్తి అన్నారు. మంగళవారం ఆయన లొడగలవానిపాలెం పంచాయతీలో శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్యం, పరిశుభ్రత కార్యక్రమాలతోనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండడంతో పాటు గ్రామాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తరలించాలని సూచించారు. సేకరించిన చెత్తను సేంద్రీయ ఎరువుగా తయారు చేసి పంచాయతీలకు ఆదాయం తీసుకురావాలని చెప్పారు. అనంతరం పంచాయతీలో పర్యటించి శానిటేషన్ పనులను పరిశీలించారు. తాగునీటి శాంపిల్స్ సేకరించి తనిఖీ చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జానకి, డిప్యూటీ ఎంపీడీవో బి. సత్యన్నారాయణ, సర్పంచ్ లొడగల రాజేశ్వరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఏకాదశి తిరువీధి



మాఢవీధుల్లో స్వామివారి తిరువీధి

సింహాచలం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాస బహుళపక్ష ఏకాదశి పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి స్వామివారికి తిరువీధి నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి బేడామండప తిరువీధి జరిపారు.మార్గం పొడవునా భక్తులు అష్టదిక్పాలకులకు పూజలు చేసి నీరాజనాలిచ్చారు.

అప్పన్న సన్నిధిలో సినీ నటుడు సాయికుమార్



:ఆలయంలో కుటుంబ సభ్యులతో నటుడు సాయికుమార్

సింహాచలం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని సినీ నటుడు సాయికుమార్, అతని కుమారుడు, హీరో ఆది కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం రాత్రి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ఆత్మీయ ఆహ్వానం పలికారు. కప్ప స్తంభం ఆలింగనం తరువాత అంతరాలయంలో అర్చకులు వారి గోత్రనామాలతో పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా అధికారులు శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

విచారణకు మోకాలడ్డు?

... 5వ పేజీ తరువాయి

ఆర్ఈసీఎస్‌లో జరుగుతున్న విచారణలో ఆ బాగోతాలు బయటకు వస్తాయన్న భయంతో దర్యాప్తు ముందుకు సాగకకుండా సదరు అధికారి అడ్డం పడుతున్నారు. కేసును నీరు గార్చేందుకు యత్నిస్తున్న వర్గానికి తనవంతు సహకారం అందిస్తున్నారు.

మాజీ ఎండీదీ అదే తీరు

ఆర్ఈసీఎస్ పనితీరు బాగా లేదని, ప్రభుత్వం లైసెన్స్ ఇవ్వలేదని పేర్కొంటూ సంస్థను ఈపీడీసీఎల్‌కు అప్పగించాలని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) 2021 మార్చిలో ఆదేశించింది. ఆ ఉత్తర్వును పక్కనపెట్టి అప్పటి ఎండీ రామకృష్ణంరాజు ఆరు నెలలు ఆర్ఈసీఎస్‌ను సహకార రంగంలోనే నడిపించారు. సర్వసభ్య సమావేశం పెట్టకుండా, ప్రభుత్వ అనుమతి లేకుండా కోట్ల రూపాయల విద్యుత్ పరికరాలు కొనుగోలు చేశారు. అడ్డగోలుగా పలువురికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. వాటిపై ఫిర్యాదులు అందడంతో ఈఆర్‌సీ ఛైర్మన్ తక్షణమే తమ ముందు హాజరై వివరాలు సమర్పించాలని ఎండీని ఆదేశించడంతో ఉద్యోగం పోతుందనే భయంతో చేసింది తప్పేనని ఒప్పుకొని ఆర్ఈసీఎస్‌ను 2021 సెప్టెంబరులో ఈపీడీసీఎల్‌కు అప్పగించారు. ఆ తరువాత వాటన్నింటిపై విచారణ చేయాలని సహకార శాఖకు చెందిన అధికారిణి శ్యామలను ఉన్నతాధికారులు ఆదేశిస్తే, ఎటువంటి తప్పులు జరగలేదని ఆమె నివేదిక ఇచ్చారు. ఇప్పుడు 51 విచారణ జరుగుతోంది. మరోవైపు ఈపీడీసీఎల్ అధికారులు సిబ్బంది సర్వీసు రిజిస్టర్లన్నీ తిరగేస్తున్నారు. అనర్హుల ఏరివేతకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో ఇవి ముందుకు సాగకుండా ఉండేందుకు ఉద్యోగులు కొందరు వినియోగదారుల పేరిట హైకోర్టును ఆశ్రయించి స్టే తేవాలని ప్రయత్నించారు. అటువంటి చర్యలు తగవని, వారిపై చర్యలకు ఆదేశించాల్సిన విజయవాడ అధికారి ఏమీ తెలియనట్టు, సమాచారం లేదని మిన్నకుండిపోయారు. ఇక్కడ అనకాపల్లి అధికారులు కూడా చర్యలకు తాత్సారం చేస్తున్నారు.

నేటి నుంచి జిల్లా కోర్టులో పోస్టుల భర్తీకి పరీక్షలు

మహారాణిపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా న్యాయస్థానాల్లో సిబ్బంది నియామకానికి ఈనెల 20 నుంచి 24 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజా తెలిపారు. పరీక్షల నిర్వహణకు హైకోర్టు జారీ చేసిన సూచనలు వివరించారు.కోర్టులో స్టెనోగ్రాఫర్ 3, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితర పోస్టులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలు కంప్యూటర్ ఆధారితంగా జరుగుతాయన్నారు.

736 కిలోల గంజాయి స్వాధీనం



బొడ్డరేవు వద్ద స్వాధీనం చేసుకున్న గంజాయి, పట్టుబడిన నిందితులతో పోలీసులు

అనకాపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు 736 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, 22 మందిని అరెస్టు చేశారు. వి.మాడుగుల మండలం శంకరం పంచాయతీ బొడ్డరేవు సమీపంలో 320 కిలోల గంజాయిని సోమవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. 16 మందిని పట్టుకోగా, మరో ముగ్గురు పరారయ్యారని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి విలేకరులకు తెలిపారు. అలాగే గొలుగొండ మండలం కొమిర శివారు ప్రాంతంలో 216 కిలోల గంజాయిని పట్టుకొని, ముగ్గురిని అరెస్టు చేశారు. అదేవిధంగా పాయకరావుపేట మండలం సీతారాంపురం జంక్షన్ వద్ద సుమారు 200 కిలో గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేశారు.

వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

మార్గదర్శకాలు విడుదల చేసిన పోలీసు శాఖ

మహారాణిపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరున వినాయక మండపాల ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో భద్రతా చర్యలు, మార్గదర్శకాలపై మంగళవారం పోలీసు కమీషనరేట్‌లో నగర కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో జీవీఎంసీ, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, పోలీసు శాఖ అధికారులు, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ బాగ్చి మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని, దరఖాస్తు చేసిన వెంటనే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. దేవుడి దర్శనం కోసం టికెట్లు ఏర్పాటు చేయరాదని, దేవుడి పేరుతో వ్యాపారం చేయవద్దని సూచించారు. వాహనాల పార్కింగ్ పేరిట రుసుములు వసూలును అంగీకరించబోమన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగేలా రహదార్లకు అడ్డంగా మండపాలను ఏర్పాటుచేయరాదని స్పష్టం చేశారు. మద్యం తాగి మండపాల వద్ద అల్లర్లు చేయరాదని, డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేస్తామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి, మాదక ద్రవ్యాలు, మద్యం తాగి అల్లరి చేస్తున్నట్లు గుర్తిస్తే ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.మండపాల వద్ద ముగ్గురు వలంటీర్లు ఉండాలని స్పష్టం చేశారు. బలవంతంగా విరాళాలు వసూలు చేయరాదని, మండపాల్లో సీసీ టీవీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

సీపీఐ రాష్ట్ర మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ



తగరపువలసలోని పార్టీ కార్యాలయంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కొమ్మాది, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఈనెల 23 నుంచి 25 వరకు సీపీఐ రాష్ట్ర మహాసభలు జరగనున్నట్లు ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు మురుపిళ్ల పైడిరాజు తెలిపారు.మంగళవారం ఆయన జోన్- 2 కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, ముఠా కార్మికులతో కలిసి మహాసభలకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ జిల్లా సమగ్రాభివృద్ధి, పార్టీ చేపట్టాల్సిన చర్యలపై చర్చించి, భవిష్యత్తులో పోరాటాలను ఉధృతం చేయనున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం నగరంలోని భూములను ఇష్టానుసారం పంచుతుందని, బీచ్‌రోడ్డులో 13.74 ఎకరాలను ప్రైవేటు సంస్థకు ఇవ్వడాన్ని ఆక్షేపించారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా నగర అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళికలు అమలు చేయడం లేదని విమర్శించారు. నగరంలో మురికివాడలు పెరిగిపోయాయని, పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదని ఆరోపించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ, పోతిన వెంకట అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలసలో...

తగరపువలస : స్థానిక సీపీఐ కార్యాలయంలో ఒంగోలులో జరిగే ఆ పార్టీ మహాసభల పోస్టర్లను నాయకులు మంగ ళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, నాయకులు కొండపు ఈశ్వరరావు, చిల్ల రాంపైడి, మాజీ కౌన్సిలర్లు చిల్ల అప్పలసూరి, మాహూరి సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.



సింహాచలం స్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

సింహాచలం రైల్వేస్టేషన్‌లో డీఆర్ఎం పర్యటన

విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) :వాల్తేరు డివిజన్ పరిధిలోని సింహాచలం, బొబ్బిలి, డొంకినవలస స్టేషన్లలో డీఆర్ఎం లలిత్ బొహ్రా మంగళవారం పర్యటించారు. అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ముందుగా సింహాచలం స్టేషన్‌కు చేరుకుని ప్రయాణికుల సదుపాయాలు, రిటైరింగ్ గదులు, వెయిటింగ్ హాళ్లు, ఫుడ్ కోర్టు ప్రాంతాలు, బుకింగ్ కార్యాలయం, పార్శిల్ ఆఫీసును పరిశీలించారు. అమృతభారత్ పథకం కింద జరుగుతున్న స్టేషన్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పార్వతీపురం, బొబ్బిలి స్టేషన్లకు వెళ్లారు.

రౌడీషీటర్ల ఇళ్లలో సోదాలు

... 5వ పేజీ తరువాయి

ఉలిక్కిపడ్డారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచి అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణలో అనుమానాస్పద ప్రాంతాలు, అనుమానిత వ్యక్తులు, అసాంఘిక కార్యకలా పాలు పాల్పడే వ్యక్తులు, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వారిని గుర్తించి వారి ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. మొత్తం 525 మంది అధికారులు, సిబ్బంది కలిసి 103 బృందాలుగా ఏర్పడి సుమారు 500 రౌడీషీటర్ల ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కత్తులను, ఎం.వి.పి.స్టేషన్ పరిధిలో ఒక ఇంట్లో కత్తి, రెండు కిలోల గంజాయి, మరొక ఇంట్లో లెక్కలు చూపని సుమారు 6 లక్షల నగదు, 11 తులాల బంగారు ఆభరణాలు, కంచరపాలెం స్టేషన్ పరిధిలో రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నగరంలో ఎటువంటి అసాంఘిక కార్య క్రమాలు జరగకుండా, గంజాయి, ఇతర మత్తు పదా ర్థాలను పట్టుకునేందుకు ఈ తనిఖీలు నిర్వహించినట్టు పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు.

తగ్గుతున్న ఉక్కు ఉత్పత్తి

... 5వ పేజీ తరువాయి

పడిపోయింది. 18వ తేదీన అంటే సోమవారం అది 17,056 టన్నులకు దిగిపోయింది. ప్లాంటులోని బ్లాస్ట్ ఫర్నేస్‌లో స్టీల్ తయారీకి ఐరన్‌ఓర్ ఫైన్స్‌తో సింటర్ (రసాయన మిశ్రమం) తయారుచేసి ఉపయోగిస్తారు. దీనికి ఉపయోగించే ఐరన్‌ఓర్ ఫైన్స్ తక్కువ ధరకే లభిస్తాయి. వీటితో సింటర్ తయారుచేసి బ్లాస్ట్ ఫర్నేస్‌లో వేయడం వల్ల స్టీల్ ఉత్పత్తి ప్రక్రియ వేగంగా జరుగుతుంది. దీనిపై అవగాహన లేని యాజమాన్య ప్రతినిధులు కొందరు కొనుగోళ్లలో కమీషన్ల కోసం సింటర్ తయారీకి అవకాశం లేకుండా నేరుగా ఉపయోగించే ఐరన్ ఓర్ పెల్లెట్లను లక్షల టన్నుల్లో కొనుగోలుకు ఒప్పందాలు చేసుకున్నారు. ఐరన్ ఓర్ ఫైన్స్ ధర టన్ను రూ.6 వేలు కాగా పెల్లెట్లు టన్ను రూ.11 వేలు పెట్టి కొంటున్నారు. అదేవిధంగా కోక్ ఓవెన్ బ్యాటరీలకు మరమ్మతులు చేయించకుండా బయట సంస్థల నుంచి కోక్ కొంటున్నారు. గతంలో కోక్ ఓవెన్ బ్యాటరీల ద్వారా రోజుకు 420 వరకు కోక్ పుషింగ్‌లు జరిగేవి. ఇప్పుడు ఆ సంఖ్య 370కి పడిపోయింది. ఇలా తక్కువైన కోక్‌ను బయట పార్టీల దగ్గర టన్నుకు రూ.5 వేలు ఎక్కువ పెట్టి కొంటున్నారు. వీటన్నింటి నేపథ్యంలో గత మూడు నెలల్లో ఉత్పత్తి వ్యయంలో ముడి పదార్థాల వ్యయం 62 శాతం నుంచి 74 శాతానికి పెరిగింది.

అన్నదానంలో చేతివాటం!

... 5వ పేజీ తరువాయి

నాణ్యత తగ్గిపోతోంది. ఇంత మొత్తం సమకూర్చడం కష్టంగా ఉండడంతో ప్రసాదాలు పులిహోర, లడ్డూల నాణ్యతను కూడా తగ్గించేస్తున్నారు. ఇటీవల కాలంలో ఓ ఆలయంలో ప్రసాదాల రుచి బాగా పడిపోయిందని దాతలే చెబుతున్నారు. ఇక్కడ జరుగుతున్న వ్యవహారాలపై ప్రజా ప్రతినిధులు పెద్దగా దృష్టిపెట్టడం లేదు. తనిఖీలు కూడా తూతూమంత్రంగానే సాగుతున్నాయి. ఇంకొందరు అధికారులు మరో అడుగు ముందుకేసి పూజార్ల ప్లేటులో భక్తులు వేసే దక్షిణలోను వాటాలు కోరుతున్నట్టు తెలిసింది. వాస్తవానికి ఆలయ ఖర్చులు ఉంటాయంటూ పూజారులు స్వచ్ఛందంగా కొంత అక్కడి మధ్య స్థాయి సిబ్బందికి ఇస్తుంటారు. కానీ ఇటీవల నెలకు రూ.25 వేలు కావాలని డిమాండ్ చేసి తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయాలకు వెళ్లి మర్యాదలు పొందే ప్రజా ప్రతినిధులు అక్కడ జరుగుతున్న వ్యవహారాలపై దృష్టి పెట్టాల్సిన ఆవశ్యకత ఉంది. ఆకస్మికంగా వెళ్లి భక్తులతో కూర్చొని అప్పుడప్పుడు అన్న ప్రసాదం తింటే...ఇలాంటి అవకతవకలకు చెక్ పెట్టొచ్చు.

కేజీహెచ్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్

... 5వ పేజీ తరువాయి

నిధులు ఇవ్వగా, కొనుగోలు ప్రక్రియ దాదాపు తుది దశకు వచ్చినట్టు చెబుతున్నారు. కొనుగోలు చేయనున్న పరికరాల జాబితాలో వెంటిలేటర్లు, మానిటర్లు, ఇతర ఐసీయూ పరికరాలు, అత్యాధునిక పరీక్ష మెషిన్లు ఉంటాయి.

మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉపయుక్తం

- డాక్టర్ ఐ.వాణి, కేజీహెచ్ సూపరింటెండెంట్

క్రిటికల్ కేర్ సెంటర్ అందుబాటులోకి వస్తే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది. పెయిన్ క్లినిక్‌ను కూడా అందులో నిర్వహించాలన్న ఆలోచన ఉంది. కొన్నిరకాల నొప్పులతో బాధపడే వారికి ఈ పెయిన్ క్లినిక్ ఉపయోగపడుతుంది. మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. రాష్ట్రస్థాయిలో పరికరాలు కొనుగోలు చేసి ఇక్కడకు పంపిస్తారు.

పొంచి ఉన్న వ్యాధులు

... 5వ పేజీ తరువాయి

నీటిని తీసుకోవాలని సూచిస్తున్నారు. అదేవిధంగా బయట ఆహారానికి దూరంగా ఉండడంతోపాటు ఇంట్లో కూడా వీలైనంత వరకూ వేడి ఆహారాన్ని తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఫ్లూ జ్వరాలు వ్యాప్తి

సీజన్ మారే సమయంలో కొన్నిరకాల ఫ్లూ వైరస్‌లు వ్యాప్తి చెంది జ్వరాలు బారినపడేలా చేస్తాయి. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమైన తరువాత ఈ తరహా ఫ్లూ వైరస్‌లు యాక్టివేట్ అవుతుంటాయి. అయితే ఈ ఏడాది సీజన్‌లో ఇప్పుడు వర్షాలు కురుస్తున్నందున ఫ్లూ వైరస్‌లు యాక్టివేట్ అయ్యే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. వాతావరణం చల్లగా మారడంతో జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలు వేధించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలను ఇవి ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. మూడు రోజులకు మించి జ్వరం, జలుబు, దగ్గు ఉంటే వైద్యులను సంప్రతించాలి.

దోమల వ్యాప్తికి అవకాశం

వర్షాలతో అనేకచోట్ల నీరు చేరుతుంది. దీనివల్ల దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. మంచి నీటిలో డెంగ్యూ కారక దోమలు వృద్ధి చెంది వ్యాప్తి చెందుతాయి. కాబట్టి, వర్షపు నీరు ఇంటి చుట్టుపక్కల నిల్వ లేకుండా చూసుకోవాలి. వర్షపు నీరు కొన్నాళ్లకు మురికి నీరుగా మారుతుంది. అందులో మలేరియా, తదితర వాటికి కారణమైన దోమలు వృద్ధి చెందుతాయి. కాబట్టి, ఇంటి చుట్టు పక్కల, పూల కుండీల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.

అప్రమత్తతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చు

- డాక్టర్ సోమయాజులు, వైద్య నిపుణులు

వర్షాలు పడిన తరువాత అనేక రకాల వ్యాధులు వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉంది. ముఖ్యంగా కలుషిత నీరు, ఆహారాన్ని తీసుకోవడం ద్వారా డయేరియా, టైఫాయిడ్ వంటి సమస్యలు వస్తాయి. అలాగే ఫ్లూ వైరస్ యాక్టివేట్ అవుతుంది. కాబట్టి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వేడి నీటిని, ఆహారాన్ని తీసుకోవాలి. ఇంట్లో, చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నిల్వ నీటిలో కొన్నిరకాల దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా బారినపడేలా చేస్తాయి.


రక్తదానం చేస్తున్న యువకులు

యువత రక్తదానం

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదినం సందర్భంగా ఉత్తరాంధ్ర చిరంజీవి యువత ఆధ్వర్యంలో మంగళవారం రక్తదానం, వైద్య శిబిరం నిర్వహించారు. ఎంవీపీ కాలనీ అప్పుఘర్ వద్ద ఆప్ నబ్ కి ఆవాజ్, కేర్ హాస్పిటల్స్ అగర్వాల్ ఐ హాస్పిటల్స్ సహకారంతో వైద్య సేవలు అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం యువ నాయకుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర చిరంజీవి యువత అధ్యక్షుడు ఎలమంచిలి సదాశివరావు, స్థానిక చిరంజీవి యువత అధ్యక్షుడు చీపల్లి ఎల్లాజీ స్వామి, తెలుగుదేశం నాయకుడు గొలగాని పోలారావు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టామని ఎంవీపీ కాలనీ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.మురళి తెలిపారు. స్టేషన్ పరిధిలోని అందరు రౌడీలు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేలా చూస్తున్నామని, కారణం లేకుండా గైర్హాజరయ్యేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవలి కాలంలో రౌడీషీటర్లపై నిఘా పెంచామని, ఒక రౌడీ షీటరు వద్ద కొంత నగదు దొరికిందని, దీనిపై ఆరా తీస్తున్నామన్నారు. మరో రౌడీ వద్ద కత్తి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చిన్న వివాదాల్లో తలదూర్చినా కేసులు నమోదు చేసి, జైలుకు పంపిస్తామన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలపై నేడు అవగాహన సదస్సు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఆగ్రో అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలపై అవగాహన కార్యక్రమాన్ని ఎంవీపీ కాలనీలోని భద్రం సామాజిక భవనంలో బుధవారం నిర్వహించనున్నట్లు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్, టీమ్ ఇండస్ట్రీస్ కన్సల్టెన్సీ, సర్వీసెస్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్త ప్రకటనలో తెలిపాయి. ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరు డీఆర్‌డీఏ కార్యాలయం సమీపంలోని సామాజిక భవనంలో మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 వరకూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నాయి. కొత్తగా వ్యాపారాలు ప్రారంభించదలచినవారు, ఇప్పటికే పరిశ్రమలు నెలకొల్పిన వారికి మార్గదర్శనం చేయడంతో పాటు, ప్రభుత్వ ఎంఎస్‌ఎంఈ పథకాలు, రుణాలపై అవగాహన కల్పించనున్నారు. వివరాలకు ఫోన్ నెంబరు 80089 38222 లో సంప్రతించాలని సంస్థలు సూచించాయి.

పోలీసుల తనిఖీలు

భీమునిపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సీపీ ఆదేశాల మేరకు పోలీసులు మంగళవారం కార్డెన్ అండర్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. బీచ్‌రోడ్, భీమిలి, తగరపువలసలోని 12 మంది రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల ఇళ్లల్లో ఏకకాలంలో సోదాలు చేశారు. చేపలుప్పాడలో ఒక రౌడీ షీటర్ ఇంట్లో 1.5 కిలోల గంజాయి, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నామని సీఐ తిరుమలరావు తెలిపారు.

సినిమా గైడ్

● వార్-2 : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● కూలీ : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
● సార్, మేడమ్ : మౌర్య (గోపాలపట్నం),
● మహావతార్ నరసింహ : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18,టమాటా 47, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 20, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 22, బీరకాయలు 34, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 42, దొండకాయలు 20, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 64, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 68, కీరదోస 30, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34,చిలగడదుంపలు 44, కంద 40,దేముడు చిక్కుడు 65, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160,కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

ఇంటింటా చెత్త సేకరణ శతశాతం జరగాలి

జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి


మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రమణమూర్తి, పాల్గొన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులు

వెంకోజీపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటి నుంచి వ్యర్థాల సేకరణ శత శాతం జరగాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి ప్రజారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జీవీఎంసీ కార్యాలయంలో ప్రజారోగ్య విభాగంపై ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎస్.వి.నరేష్ కుమార్, ఇతర అధికారులతో పాటు టెలికాన్ఫరెన్స్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులతో సమీక్షించారు. అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వర్షాలు కురుస్తున్నందున ప్రజారోగ్య అధికారులు, పారిశుధ్య కార్మికులు చెత్త పేరుకుపోకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి నూరుశాతం చెత్త సేకరించాలని, చాలా వార్డులలో ఈ పని అనుకున్న స్థాయిలో ఎందుకు జరగడం లేదంటూ ఆయా శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆరా తీశారు. కాలానుగుణ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వారి విధుల పట్ల అంకితభావంతో ఉండి అన్ని పనులు సక్రమంగా నిర్వహించేలా చూడాలని ఆదేశించారు. ఈ నెల 27న వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా అనుమతుల కోసం సింగిల్ విండో క్లియరెన్స్ సెల్ జీవీఎంసీ అన్ని జోనల్ కార్యాలయాలతో పాటు ప్రధాన కార్యాలయంలోనూ ఇప్పటికే ఏర్పాటు చేశామని, సాధ్యమైనంతవరకు జోనల్ కార్యాలయంలోనే అనుమతులు ఇచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సీఎంఓహెచ్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు గెడ్డలు ఎక్కడా పొంగిపొర్లలేదని, నిత్యం వ్యర్థాలను సకాలంలో తొలగించడమే కారణమని తెలిపారు. అపరాధ రుసుం సరిగా వసూలు చేయకపోవడంతో ప్లాస్టిక్ వినియోగం పెరిగే అవకాశం ఉందన్నారు. దుకాణాల ముందు వ్యర్థాలు ఉంటే వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలని, నగరంలో ట్రేడ్ లైసెన్సులు కొత్తగా జారీ చేయడంపై దృష్టి సారించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లను ఆదేశించారు. నగరంలో మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా, వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా కావాల్సిన కెమికల్స్ సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. నగరంలో పందులు, వీధి కుక్కలు, పశువుల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, వీధి కుక్కల నియంత్రణకు ప్రతిరోజు ఆపరేషన్లు, వాక్సినేషన్స్ వేయాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలన్నారు. 40వ వార్డు ఏకేసీ కాలనీ-1 సచివాలయం శానిటరీ కార్యదర్శి సన్యాసిరావు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నందున అతనికి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సహాయ వైద్యాధికారులు, జీవీఎంసీ బయాలజిస్టు, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, మలేరియా సిబ్బంది, వెటర్నరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్ల పార్కింగ్ కోసం కాలువలు మూసేశారు

పారిశుధ్య నిర్వహణ చేపట్టలేని పరిస్థితి


కాలువలు మూసి వేసి కార్లు నిలిపిన దృశ్యం

వెంకోజీపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఒక పక్క 16వ వార్డు.. మరోవైపు 15వ వార్డు...నడి మధ్యన రోడ్డు... వారు గానీ... వీరు గానీ... ఎవరూ.... శుభ్రం చేయలేదు... రెండు వార్డుల శానిటరీ సిబ్బందికి, టౌన్ ప్లానింగ్ అధికారులకైనా ఇది పట్టలేదు.. రానున్న భారీ వర్షాలకు ఈ ప్రాంతంలో కచ్చితంగా రోడ్డుపై వరదలేనని.. తమ ఇండ్లలోకి మురుగునీరు ప్రవాహమేనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదీ ఇసుకతోట కృష్ణమందిరం రోడ్డు పరిస్థితి. ఈ రోడ్డుకు రోడ్డుకు రెండు వైపుల కాలువలు పూర్తిగా మూసుకుపోయి నిర్మాణాలు సాగించారు. పూడ్చేసిన కాలువలను తీయాల్సిన బాధ్యత శానిటేషన్‌కు ఉంది... ఆ కాలువలు కనిపించకుండా కప్పేస్తే ఆక్రమణలను తొలగించి కాలువలను వెలికి తీయాల్సిన బాధ్యత టౌన్‌ప్లానింగ్ పై ఉంది. అయినా అటు శానిటేషన్ వారు కానీ, ఇటు టౌన్ ప్లానింగ్ వారు కానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చిన్న పాటి వర్షం పడితే చాలు ఇక్కడి కృష్ణ మందిరం వద్ద మురుగు నీరు నిలిచిపోయి, రోడ్డంతా మురుగు మయంగా మారుతుంది. మురుగునీరు ఇండ్లలోకి ప్రవహిస్తుంది. ఈ విషయంపై స్థానికులు అనేక మార్లు శానిటేషన్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా, ఆ మురుగు చేరినప్పుడు మాత్రం వచ్చి శుభ్రం చేసి వెళ్తున్నారు మరోసారి మురుగు చేరకుండా చర్యలు మాత్రం తీసుకోవడం లేదని వాపోతున్నారు. కాలువలను కప్పేసి మరి నిర్మించిన ఇక్కడి స్వగృహా వారికి గానీ, ఇప్పుడిప్పుడే కాలువపై నిర్మాణ సామాగ్రిని ఉంచి నిర్మించిన బిల్డర్‌పై గానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వ్యక్తమౌతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి తమ సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

ఎంతకాలం గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్‌ని విమర్శిస్తారు..?

కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక దండి

వెంకోజీపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బెంగళూరులోని మహదేవపురలో జరిగిన ఓట్ల చోరీ వ్యవహారం బయటపెట్టినప్పటి నుంచి ప్రధాని మోదీకి మతిపోయిందని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గం ఇంచార్జి ప్రియాంక దండి విమర్శించారు. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె మాట్లాడుతూ దేశ ప్రజానీకం ఓట్ల చోరీని నమ్ముతున్నారని, తెలంగాణలో కేసీఆర్ పదేళ్ల దాటినా ఇప్పటికీప్రత్యేక రాష్ట్ర సెంటిమెంట్‌ని ఎలా ఉపయోగిస్తున్నారో, బీజేపీ కేంద్ర ఎన్నికల సంఘంతో కుమ్మక్కై ఓటు చోరీ అంశాన్ని తప్పుదోవ పట్టించడానికి సింధు జలాల ఒప్పందం నెహ్రూ చేశారంటూ మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. అటల్ బిహారీ వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నారని, అప్పుడు నాటి ప్రధానిని ఒప్పించి సింధు జలాల ఒప్పందం ఎందుకు రద్దు చేయలేదని ఆమె ప్రశ్నించారు. గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్‌లను విమర్శించకుండా బీజేపీ రాజకీయం చేయలేదని ఎద్దేవా చేశారు. ప్రజలు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లను ఇకపై నమ్మరని ప్రకటనలో పేర్కొన్నారు.

'నగర అభివృద్ధికి సహకరించండి'


కమిషనర్ కేతన్‌గార్గ్‌ను కలిసిన స్థాయీ సంఘం సభ్యులు

వెంకోజీపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా ఎన్నికైన జీవీఎంసీ స్థాయీ సంఘం సభ్యులు మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ కేతన్‌గార్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగాకమిషనర్ సభ్యులను అభినందిస్తూ స్థాయీ సంఘానికి వచ్చిన పనులపై క్షుణ్ణంగా చర్చించి, ఆమోదించి విశాఖ నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

మంత్రి నాదెండ్లను కలిసిన భీమిలి ఏఎంసీ చైర్మన్


మంత్రి మనోహర్‌ను కలిసిన రామస్వామినాయుడు

పద్మనాభం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ కురిమిన రామస్వామినాయుడు నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకులు మంగళవారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నామినేటెడ్ పదవుల్లో తమకు స్థానం కల్పించినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రి మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదవులు పొందిన వారు అలంకారం కోసం కాకుండా ప్రజా సేవ చేస్తూ నిత్యం వారితో మమేకం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేములవలస పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి రౌతు నాగరాజు, నాయకులు బీవీ కృష్ణయ్య, శ్రీకాంత్, ఎం. శ్రీను, వీబీ నాయుడు, రాజు, సాగర్, అప్పలరాజు, బాలు మూర్తి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో నరెడ్కో జాతీయ సదస్సు

- ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహణ - రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్, కో-ప్రధాన కార్యదర్శి వైవీ చౌదరి, ఉత్తర మండల అధ్యక్షుడు ఎ.రమేశ్‌బాబు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎంఏ హుస్సేన్, కోశాధికారి కేవీవీ సుబ్బారావు

పెదవాల్తేరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) 17వ జాతీయ సదస్సు ఈనెల 29,30 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్నట్టు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్ తెలిపారు. ఈమేరకు మంగళవారం పెదవాల్తేరులోని నరెడ్కో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చక్రధర్ మాట్లాడుతూ సదస్సుకు కేంద్ర మంత్రులు పీయూష్‌గోయెల్, మనోహర్ లాల్, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, సాహు, రాష్ట్ర మంత్రి నారాయణ, ఏపీ ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు.ఇందులో సంస్కరణలు, పట్టణ పరివర్తన, రియల్ ఎస్టేట్ అభివృద్ధిపై చర్చిస్తామన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ మొదటి స్థానంలో ఉందని తెలిపారు. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, రెవెన్యూ విభాగం, సేల్ కమ్ జీపీఏ మినహాయింపు, ఆఫర్ టేబుల్ హౌసింగ్, సింగిల్ విండో క్లియరెన్స్ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. నరెడ్కో కో-ప్రధాన కార్యదర్శి వైవీ చౌదరి మాట్లాడుతూ సదస్సులో 800 మంది సభ్యులు ఉన్నారని, జాతీయ అధ్యక్షుడిగా తెలుగువారైన జి.హరిబాబు, చైర్మన్‌గా రాజన్ ఎన్ బండేల్కర్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ సదస్సులో అమరావతి అభివృద్ధిపై చర్చించి, దేశవ్యాప్తంగా ప్రజంటేషన్ ఇస్తామని వివరించారు. సమావేశంలో నరెడ్కో ఉత్తర మండల అధ్యక్షుడు ఎ.రమేశ్‌బాబు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎంఏ హుస్సేన్, కోశాధికారి కేవీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


మధురవాడలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి ప్రతిమలు

అమ్మకానికి గణపయ్య ప్రతిమలు సిద్ధం

మధురవాడ/పద్మనాభం రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27వ తేదీ నుంచి జరిగే వినాయక నవరాత్రి ఉత్సవాలకు గణేశ్ ప్రతిమలు సిద్ధమవుతున్నాయి. పర్యావరణహితంగా బంక మట్టి,వరిగడ్డి, ప్రకృతి సహజమైన రంగులతో వీటిని తయారు చేస్తున్నారు. ఒడిశా, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన కళాకారులు రెండు నెలలుగా మధురవాడలో వీటి తయారీలో నిమగ్నమై ఉన్నారు. ఏటా ఈ సీజన్‌కు ముందు వారు ఇక్కడికి వచ్చి మట్టి ప్రతిమలు తయారు చేస్తుంటారు. నాలుగు అడుగుల ఎత్తు నుంచి పదిహేను అడుగులు ఎత్తు వరకు బొమ్మలు తయారు చేస్తున్నారు. ఒక్కొక్క బొమ్మ ధర సైజును బట్టి రూ. 500 నుంచి రూ. 40 వేల వరకూ విక్రయిస్తున్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుల నిరసన


నిరసన తెలుపుతున్న డిగ్రీ అధ్యాపకులు

భీమునిపట్నం,ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తక్షణమే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు మంగళవారం ఆందోళన చేశారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి కళాశాల భవనం ముందు నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నంబరు 42 రద్దు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ప్రిన్సిపాళ్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఈనెల 29న చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా జీసీజీటీఏ అధ్యక్షుడు విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రం విడుదల చేస్తున్న పరశురామరాజు, తదితరులు

30న సంచార జాతుల విముక్తి దినోత్సవం

పెదవాల్తేరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సంచార-అర్ధ సంచార జాతుల విముక్తి దినోత్సవం సందర్భంగా మంగళవారం బీజేపీ కార్యాలయంలో స్ఫూర్తి కార్యక్రమం కరపత్రాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎస్ పరశురామరాజు తదితరులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 30న విజయవాడలో సంచార, అర్ధ సంచార జాతుల విముక్తి దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. వారు 'మట్టిలో మాణిక్యాలు-మన చరిత్రలో వెలిగే దీపాలు' అని అభివర్ణించారు. దేశం నలుమూలలా తిరుగుతూ కళల ఉనికి చాటుతూ ఆచారాలకు రూపం ఇచ్చారన్నారు. సనాతన ధర్మానికి వారధులుగా ఉంటూ సాంస్కృతిక వైభవం, పునరుద్ధరణకు బాటలు వేస్తూ సంచారం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లి శ్రీనివాసులు నాయుడు, రాష్ట్ర కోశాధికారి కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు పలిరెడ్డి శ్రీనివాసరావు, శ్రీరంగం ధనేశ్వరరావు, పోతిన పైడిరాజు, రేణంకి విజయ చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు మూణ్నాళ్ల ముచ్చటేనా?


ఆదర్శనగర్ జాతీయ రహదారి వద్ద వెలిసిన బడ్డీ దుకాణాలు

ఆరిలోవ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 10వ వార్డు ఆదర్శనగర్ జాతీయ రహదారి పక్కన కొత్తగా నిర్మించిన బస్‌షెల్టరు వద్ద ఇష్టానుసారంగా దుకాణాలు వెలిశాయి. దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు కొందరు బ్రోకర్లు కూడా ఉన్నారు. వీరి అండదండలతో ఇక్కడ బడ్డీలు పెట్టి వాటిని అద్దెలకు ఇస్తుంటారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది. కాని ఎవరూ వీటిని పెద్దగా పట్టించుకోవడంలేదు. జీవీఎంసీ అధికారులు తమ బాధ్యత కాదన్నట్లు ముఖం చాటేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. గతంలో 'ఆంధ్రజ్యోతి' ఈ విషయం వెలుగులోకి తేవడంతో జీవీఎంసీ అధికారులు స్పందించి వాటిని తొలగించారు. కొద్దికాలం తరువాత మళ్లీ అదే స్థలంలో దళారుల సహకారంతో అదనంగా మరికొన్ని బడ్డీలు ఏర్పాటు చేశారు. టౌన్ ప్లానింగ్ విభాగం వారు వీటిపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇంట్లోకి కొండచరియలు



వెంకోజీపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 15వ వార్డు అంబేద్కర్‌నగర్ కొండవాలు ప్రాంతంలో కొండచరియలు విరిగి రాళ్లు ఓ ఇంట్లోకి చొచ్చుకువచ్చాయి. కొండవాలు ఆనుకుని ఉన్న ఓ గ్రూప్ హౌస్‌కు మంగళవారం ఉదయం ఒక్కసారిగా కొండచరియ విరిగి బండరాళ్లు కింద పోర్షన్ కిటికీని తోసుకుంటూ ఇంటిలోకి చొరబడ్డాయి. అయితే ఆ సమయంలో గదిలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. ఇంటిలో నివసిస్తున్న జాతీయ వినియోగదారుల సంఘం చైర్మన్ ఆర్.సాయిరమేష్ కొండ చరియలు విరిగి పడిన గదిని కార్యాలయంగా వినియోగించడం, ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో కేవలం ఆస్తి నష్టం తప్ప ఎటువంటి ప్రమాదం సంభవించలేదన్నారు. ఈవిషయం తెలిసిన వెంటనే కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, ఏఈ భాగ్యశ్రీతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దృష్టికి తీసుకువెళ్తానని, ఇంటిలోకి చొచ్చుకువచ్చిన రాళ్లు, మట్టిని వెంటనే తొలగించమని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. త్వరలోనే ఈ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

శ్రీప్రకాష్‌లో ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం


ప్రదర్శనను తిలకిస్తున్న ఫొటోగ్రాఫర్లు, అతిథులు

విశాఖపట్నం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను అగర్వాల్ ఇమేజెస్ అధినేత బీకే అగర్వాల్ ప్రారంభించారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు నిర్వహించిన పోటీలో 450 మంది తీసిన సుమారు 1400 ఫొటోలను ప్రదర్శనలో ఉంచారు. ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ అశోక్ కందిమళ్ల, సీనియర్ జర్నలిస్టు నివేదిత గంగూలీ, సినిమాటోగ్రాఫర్ ఎస్.శ్రీహరివర్మ హాజరయ్యారు. అనంతరం శ్రీప్రకాష్ డైరెక్టర్ వాసు ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సభలో ఫొటోగ్రఫీలోని మెలకువలను విద్యార్థులకు వివరించారు. జూనియర్ విభాగంలో ఎం.సమన్విత, కె.జతిన్, వై.పిరాయి యాజిని, ఫ్లవర్స్ అంశానికి సంబంధించి పి.రాహిత్య, ఎ.సాయివినయ్‌కార్తీక్, సీనియర్స్ విభాగంలో రాజ్‌దీప్ శుక్లా, శ్రావణి, సి జగవంత్ కామేష్, స్ట్రీట్ ఫొటోగ్రఫీ అంశంలో డీడీ వాన్షిక, కె.దేవ్‌రోహన్, ఘనశ్యామ్ మీనన్ విజేతలుగా నిలిచారు.

జిల్లా న్యాయస్థానాల్లో ఉద్యోగ నియామకాలకు నేటి నుంచి పరీక్షలు

మహారాణిపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయస్థానాలలో సిబ్బంది నియామకానికి ఈ నెల 20 నుంచి 24 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా తెలిపారు. పరీక్షల నిర్వహణకు హైకోర్టు జారీ చేసిన సూచనలను వివరించారు. కోర్టులో స్టెనోగ్రాఫర్ 3, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితర పోస్టులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలు మూడు షిఫ్ట్‌లలో కంప్యూటర్ ఆధారితంగా జరుగుతాయని పేర్కొన్నారు.

అనకాపల్లి జిల్లాలో 736 కిలోల గంజాయి స్వాధీనం

» 22మంది అరెస్టు

అనకాపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు 736 కిలోల గంజాయిని స్వాధీనం చేసున్నారు. ఇందుకు సంబంధించి 22 మందిని అరెస్టు చేశారు. వి.మాడుగుల మండలం శంకరం పంచాయతీ బొడ్డేరేవు గ్రామ సమీపంలో 320 కిలోల గంజాయిని సోమవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా 16 మందిని పట్టుకోగా, మరో ముగ్గురు పరారయ్యారని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి మంగళవారం విలేకరులకు తెలిపారు. అలాగే గొలుగొండ మండలం కొమిర శివారు ప్రాంతంలో 216 కిలోల గంజాయిని పట్టుకొని, ముగ్గురిని అరెస్టు చేశారు. అదేవిధంగా పాయకరావుపేట మండలం సీతారాంపురం జంక్షన్ వద్ద సుమారు 200 కిలో గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.కోటి వరకూ ఉంటుందని చెబుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధిత కుటుంబానికి మంజూరుపత్రం అందజేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మర్రిపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్ చెక్కులు)ని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మంగళవారం పంపిణీ చేశారు. మర్రిపాలెం శ్యామ్‌కాలనీలో నివాసముంటున్న కె.లక్ష్మికి రూ.42 వేలు, బి.భానుకు రూ.64 వేల చెక్కులను వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు పెంటకోట అజేయ్‌బాబు, నాయకులు గిరిరాజు, సేనాపతి సురేష్, మదన్, నరేష్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి పూజలు

మహారాణిపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంగళవారం అష్టదళ పద్మారాధన పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ లక్ష్మి పూజలు చేశారు. భక్తులు, ఉభయదాతలు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కేజీహెచ్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్

... 5వ పేజీ తరువాయి

నిధులు ఇవ్వగా, కొనుగోలు ప్రక్రియ దాదాపు తుది దశకు వచ్చినట్టు చెబుతున్నారు. కొనుగోలు చేయనున్న పరికరాల జాబితాలో వెంటిలేటర్లు, మానిటర్లు, ఇతర ఐసీయూ పరికరాలు, అత్యాధునిక పరీక్ష మెషిన్లు ఉంటాయి.

మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉపయుక్తం

క్రిటికల్ కేర్ సెంటర్ అందుబాటులోకి వస్తే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది. పెయిన్ క్లినిక్‌ను కూడా అందులో నిర్వహించాలన్న ఆలోచన ఉంది. కొన్నిరకాల నొప్పులతో బాధపడే వారికి ఈ పెయిన్ క్లినిక్ ఉపయోగపడుతుంది. మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. రాష్ట్రస్థాయిలో పరికరాలు కొనుగోలు చేసి ఇక్కడకు పంపిస్తారు.

-డాక్టర్ ఐ.వాణి,
కేజీహెచ్ సూపరింటెండెంట్

తగ్గుతున్న ఉక్కు ఉత్పత్తి

... 5వ పేజీ తరువాయి

పడిపోయింది. 18వ తేదీన అంటే సోమవారం అది 17,056 టన్నులకు దిగిపోయింది.

ప్లాంటులోని బ్లాస్ట్ ఫర్నేస్‌లో స్టీల్ తయారీకి ఐరన్‌ఓర్ ఫైన్స్‌తో సింటర్ (రసాయన మిశ్రమం) తయారుచేసి ఉపయోగిస్తారు. దీనికి ఉపయోగించే ఐరన్‌ఓర్ ఫైన్స్ తక్కువ ధరకే లభిస్తాయి. వీటితో సింటర్ తయారుచేసి బ్లాస్ట్ ఫర్నేస్‌లో వేయడం వల్ల స్టీల్ ఉత్పత్తి ప్రక్రియ వేగంగా జరుగుతుంది. దీనిపై అవగాహన లేని యాజమాన్య ప్రతినిధులు కొందరు కొనుగోళ్లలో కమీషన్ల కోసం సింటర్ తయారీకి అవకాశం లేకుండా నేరుగా ఉపయోగించే ఐరన్ ఓర్ పెల్లెట్లను లక్షల టన్నుల్లో కొనుగోలుకు ఒప్పందాలు చేసుకున్నారు. ఐరన్‌ఓర్ ఫైన్స్ ధర టన్ను రూ.6 వేలు కాగా పెల్లెట్లు టన్ను రూ.11 వేలు పెట్టి కొంటున్నారు. అదేవిధంగా కోక్ ఓవెన్ బ్యాటరీలకు మరమ్మతులు చేయించకుండా బయట సంస్థల నుంచి కోక్ కొంటున్నారు. గతంలో కోక్ ఓవెన్ బ్యాటరీల ద్వారా రోజుకు 420 వరకు కోక్ పుషింగ్‌లు జరిగేవి. ఇప్పుడు ఆ సంఖ్య 370కి పడిపోయింది. ఇలా తక్కువైన కోక్‌ను బయట పార్టీల దగ్గర టన్నుకు రూ.5 వేలు ఎక్కువ పెట్టి కొంటున్నారు. వీటన్నింటి నేపథ్యంలో గత మూడు నెలల్లో ఉత్పత్తి వ్యయంలో ముడి పదార్థాల వ్యయం 62 శాతం నుంచి 74 శాతానికి పెరిగింది.

కొండవాలు ప్రజల కష్టాలకు త్వరలో చెల్లుచీటీ

» కల్యాణ మండపం నిర్మాణానికి ఎట్టకేలకు శ్రీకారం » బాపూజీ నగర్‌లో రూ.2.5 కోట్లతో పనులు » మూడు నెలల్లో అందుబాటులోకి ..



బాపూజీనగర్‌లో పనులు చేపడుతున్న దృశ్యం

కంచరపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 46, 47, 48 వార్డుల పరిధి కొండవాలు గ్రామాల్లో నివాసం ఉంటున్నవారి ఇళ్లలో వివాహాలు తదితర ఏ శుభకార్యం నిర్వహించాలన్నా అనేక అవస్థలు పడాల్సిందే. రోడ్లు, వీధులే వారికి వేదికలు! తమ వీధిలో కార్యక్రమం జరపాలంటే రోడ్లు బ్లాక్ చేసుకోవాల్సిన పరిస్థితి. ఇలా చేసినప్పుడు ఇతరులు ఇబ్బంది పడుతుంటారు. కప్పరాడ, బాపూజీనగర్, రాంజీ ఎస్టేట్, పల్నాటికాలనీ, శ్రీనివాసనగర్, నీలకంఠనగర్, పెదకొత్తూరు, బర్మాక్యాంప్, జైభారత్ నగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల ప్రజలు ఎటువంటి శుభకార్యం నిర్వహించుకోవాలన్నా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. వీరి కష్టాలకు త్వరలో చెల్లుచీటీ రాయనున్నారు. కొండవాలు ప్రజల అవస్థలు త్వరలోనే తీరనున్నాయి. జీవీఎంసీ 48వ వార్డు పరిధి బాపూజీనగర్‌లో 450 గజాల స్థలంలో జీ+1 విధానంలో సుమారు రూ.2.5 కోట్లు వెచ్చిస్తూ మెగా కల్యాణ మండపం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఇటీవల ఈ పనులకు శంకుస్థాపన కూడా చేశారు. మూడు నెలల వ్యవధిలో నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు కల్యాణ మండపాన్నిఅందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేటర్ చొరవతో పనులు ప్రారంభం...

కొండవాలు ప్రజల ఇబ్బందులను స్వయంగా చూసిన 48వ వార్డు కార్పొరేటర్ గంకల కవిత ప్రత్యేక కృషి, చొరవతోనే బాపూజీనగర్‌లో కల్యాణ మండపం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. జీవీఎంసీ కౌన్సిల్‌లో ప్రత్యేకంగా కొండవాలు ప్రజల సమస్యలను ప్రస్తావించి నిధులు మంజూరయ్యేలా కృషిచేశారని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు స్వయంగా ఆమె చొరవను అభినందించారు. ఇటీవల పునాదుల గోతులు తవ్వి కొంతమేర ప్రాథమిక పనులు చేపట్టినా, ప్రస్తుతం వర్షాలు కురవడంతో గుంతల్లో నీరు చేరింది. అల్పపీడన ప్రభావం దాటిన వెంటనే చకచకా పనులు చేపట్టడానికి నిర్మాణ సామగ్రితో సిద్ధంగా ఉన్నారు.

హెల్మెట్ ఉపయోగంపై అవగాహన



ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ దాశరథి

మర్రిపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శిరస్త్రాణం ప్రాణానికి రక్షణ కవచమని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి అన్నారు. మంగళవారం ఆయన మర్రిపాలెంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా శిరస్త్రాణం ధరించాలన్నారు. అనుకోని ప్రమాదం జరిగినప్పుడు శిరస్త్రాణం ప్రాణాపాయం నుంచి కాపాడుతుందన్నారు. శిరోభారంగా కాకుండా బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అతివేగం, ముగ్గురేసి వెళ్లడం, దూకుడుగా వాహనం నడపడం నేరమని, ఏరికోరి ప్రమాదాల బారినపడి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కంచరపాలెం ట్రాఫిక్ పోలీసుస్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో నగర క్రీడాకారిణులకు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారిణులతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అస్మిత ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ మహిళల వెయిట్ లిఫ్టింగ్ టోర్నీలో బుల్లయ్య కళాశాల విద్యార్థినులు పతకాలు సాధించారు. విజయనగరంలో జరిగిన ఈ టోర్నీ 48 కిలోల విభాగంలో లావణ్య స్వర్ణం, జాహ్నవి, తేజశ్రీ రజత పతకాలు సాధించారు. 53 కిలోల కేటగిరీలో జ్యోత్స్న కాంస్యం, 69 కిలోల విభాగంలో పూజిత రజతం, 86 కిలోల విభాగంలో అమృత కాంస్య పతకం సాధించారు. మంగళవారం కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్, ప్రిన్సిపాల్స్ చక్రవర్తి, సోమేశ్వరరెడ్డి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరక్టర్ డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి తదితరులు పతకాలు సాధించిన విద్యార్థినులను అభినందించారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 22న మెగా జాబ్ మేళా

సీతంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల్లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు దక్షిణ నియోకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు కలసి జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. దక్షిణ నియోజకవర్గంలో నిరుద్యోగ యువతీ, యువకులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పదో తరగతి ఉతీర్ణత లేదా తప్పినవారు, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, పీజీ చదివినవారికి ఉద్యోగ అవకాశం ఉందన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ఈ నెల 22న ఉదయం 9 గంటలకు జైలు రోడ్డు వద్ద గల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో దాదాపు 30 కంపెనీలు వెయ్యిమందికి పైగా ఉద్యోగాలకు ఎంపిక చేసేందుకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ హరిప్రసాద్, రూరల్ అధ్యక్షుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, డిప్యూటీ మేయర్ గోవింద రెడ్డి, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ గంగులయ్య, జనసేన పార్టీ యువనేత డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి చాముండేశ్వరి, రమేష్, మంజుల, నియోజకవర్గ ఇంచార్జ్‌లు పాల్గొన్నారు.



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ తదితరులు

'కృత్రిమ మేధ ప్రాధాన్యం గుర్తించండి'



అవగాహన కల్పిస్తున్న డా.మల్లిఖార్జున్

కంచరపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల్లో మంగళవారం విద్యార్థులకు పరిశ్రమ సిద్ధం,కృత్రిమ మేధస్సులో మార్పులు, భవిష్యత్ అవకాశాలు అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌టీడీ) విశాఖపట్టణం చాప్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఉపన్యసించారు. లాబ్ కార్ప్ డైరెక్టర్ డా.మల్లిఖార్జున్ కొరిపాడు ముఖ్య అతిథిగా హాజరై ఆసక్తికర అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ మాట్లాడుతూ సాంకేతికత విస్తరణకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. కృత్రిమ మేధలో మార్పులను వివరించారు. ఈ కార్యక్రమంలో డా.ఓఎంఆర్.రావు, ప్రొ.సాంబశివరావు, డా.ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి పథకానికి విస్తృత ప్రచారం కల్పించాలి

ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు



ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు, తదితరులు

ద్వారకాబస్‌స్టేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేసిన స్త్రీశక్తి పథకానికి విస్తృత ప్రచారం కల్పించాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు అధికారులకు, సిబ్బందికి సూచించారు. పథకానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వీటిని బస్సు లోపల వెలుపల, బస్టాపులు, ఆర్టీసీ కాంప్లెక్సుల్లో అతికించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కె.పద్మావతి, తిరుపతి, శ్రీధర్ పాల్గొన్నారు.


ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలికలను తల్లి చెంతకు చేర్చిన పోలీసులు

కంచరపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సోమవారం రాత్రి ఇంటి నుంచి భయపడి వెళ్లిపోయిన గవరకంచరపాలెం ప్రాంతానికి చెందిన ఇద్దరు బాలికలను కంచరపాలెం పోలీసులు మంగళవారం వారి తల్లి చెంతకు చేర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. గవర కంచరపాలెంలో నివాసం ఉంటున్న గేదెల రేఖకు ఇద్దరు కుమార్తెలు ప్రీతి(10), శృతి (9) ఉన్నారు. రేఖ రైల్వే స్టేషన్‌లో ఓ దుకాణంలో పనిచేస్తుంది. సోమవారం మధ్యాహ్నం రేఖ తన ఇద్దరు పిల్లలను ఇంటి వద్ద వదిలి డ్యూటీకి వెళ్లి తిరిగి రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి చేరుకుంది. ఇంటి వద్ద తన ఇద్దరు పిల్లలు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికింది. ఎక్కడా కనిపించకపోవడంతో కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన సీఐ కె.రవికుమార్ బాలికల ఫొటోలను సోషల్ మీడియాకు పంపారు. కంచరపాలెం ప్రాంతానికి చెందిన సబీనా అనే మహిళ బాలికలు ఆర్పీపేట రైల్వే ట్రాక్ సమీపంలో ఒక జిమ్ వద్ద సంచరించడాన్ని గుర్తించి వారిని ప్రశ్నించింది. తమ ఇంట్లో మొబైల్ ఫోన్ పోయిందని, అమ్మ మందలిస్తుందన్న భయంతో ఇంటి నుంచి బయటకు వచ్చామని బాలికలు తెలపడంతో సబీనా స్థానిక అంగన్వాడీ కార్యకర్తకు సమాచారం అందించారు.రాత్రి కావడంతో చిన్నారులను సబీనా ఇంటి వద్ద ఉంచమని చెప్పి మంగళవారం ఉదయమే కంచరపాలెం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు. అప్పటికే ఆ బాలికలపై మిస్సింగ్ కేసు నమోదుకావడంతో సీఐ కె.రవికుమార్ బాలికల తల్లి రేఖను పిలిపించి వారిని అప్పగించారు.

కంచరపాలెం ఐటీఐ ప్రాంగణంలో 22న జాబ్‌మేళా

కంచరపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం బాలికల ఐటీఐ ప్రాంగణంలో నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈ నెల 22న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తామని ఉప ప్రాంతీయ ఉపాధి కల్పనాధికారి శ్యాంసుందర్ నిట్టల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, మెడ్‌ప్లస్, అమేయా ఎలక్ట్రానిక్స్ తదితర సంస్థలు పాల్గొంటాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, ఫార్మసీ కోర్సులు చేసిన నిరుద్యోగులు హాజరుకావచ్చు. క్లర్క్, వెహికల్ అసిస్టెంట్, డ్రైవర్, ఫార్మాసిస్టు, ట్రైనీ తదితర ఉద్యోగాలకు అర్హులను ఎంపిక చేయనున్నట్టు శ్యాంసుందర్ పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగులు ముందుగా తమ వివరాలను నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అదేవిధంగా 22న ఉదయం 10 గంటలకు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.


ప్రపంచ ట్రాన్స్‌ప్లాంట్ క్రీడలకు రమణయ్య పయనం



విశాఖపట్నం స్పోర్ట్స్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక ప్రపంచ ట్రాన్స్‌ప్లాంట్ క్రీడా పోటీల్లో నగరానికి చెందిన రైల్వే రిటైర్డ్ ఉద్యోగి రమణయ్య ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ కారణాలతో అవయవ మార్పిడి చేసుకుని ఆరోగ్యవంతులుగా ఉన్నవారికి వివిధ క్రీడాంశాలలో ఏటా క్రీడా పోటీలు నిర్వహిస్తారు. ఇలాంటివారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే ఈ టోర్నీ ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం జర్మనీ ఆతిథ్యమిస్తున్న ఈ క్రీడల్లో నగరానికి చెందిన రమణయ్య లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేసుకున్నవారికి నిర్వహించే టెన్నిస్ టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన శిక్షణ శిబిరంలో పాల్గొని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకున్న రమణయ్య మంగళవారం జర్మనీ చేరుకున్నారు.

మండపాల నిర్వాహకులు మార్గదర్శకాలు పాటించాలి

» మద్యం, మాదకద్రవ్యాలు సేవించి అల్లరి చేస్తే కఠిన చర్యలు » పోలీసు కమిషనర్ బాగ్చి హెచ్చరిక



సమన్వయ కమిటీ సమావేశంలో సూచనలు చేస్తున్న నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

మహారాణిపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరున వినాయక మండపాల ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో భద్రతా చర్యలు, మార్గదర్శకాలపై మంగళవారం పోలీసు కమీషనరేట్‌లో నగర కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో జీవీఎంసీ, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, పోలీసు శాఖ అధికారులు, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ బాగ్చి మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని, దరఖాస్తు చేసిన వెంటనే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. దేవుడి దర్శనం కోసం టికెట్లు ఏర్పాటు చేయరాదని, దేవుడి పేరుతో వ్యాపారం చేయవద్దని సూచించారు. వాహనాల పార్కింగ్ పేరిట రుసుములు వసూలును అంగీకరించబోమన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగేలా రహదార్లకు అడ్డంగా మండపాలను ఏర్పాటుచేయరాదని స్పష్టం చేశారు. మద్యంతాగి మండపాల వద్ద అల్లర్లు చేయరాదని హెచ్చరించారు. డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేస్తామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి, మాదక ద్రవ్యాలు, మద్యం తాగి అల్లరి చేస్తున్నట్లు గుర్తిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. మండపాల వద్ద ముగ్గురు వలంటీర్లు ఉండాలని స్పష్టంచేశారు. బలవంతంగా విరాళాలు వసూలు చేయరాదని, మండపాలలో సీసీ టీవీలు ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ బాగ్చి సూచించారు.

ఆర్ఈసీఎస్‌పై విచారణకు మోకాలడ్డు?

... 5వ పేజీ తరువాయి

ఆర్ఈసీఎస్‌లో జరుగుతున్న విచారణలో ఆ బాగోతాలు బయటకు వస్తాయన్న భయంతో దర్యాప్తు ముందుకు సాగకకుండా సదరు అధికారి అడ్డం పడుతున్నారు. కేసును నీరు గార్చేందుకు యత్నిస్తున్న వర్గానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. మాజీ ఎండీదీ అదే తీరు: ఆర్ఈసీఎస్ పని తీరు బాగా లేదని, ప్రభుత్వం లైసెన్స్ ఇవ్వలేదని పేర్కొంటూ సంస్థను ఈపీడీసీఎల్‌కు అప్పగించాలని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) 2021 మార్చిలో ఆదేశించింది. ఆ ఉత్తర్వును పక్కనపెట్టి అప్పటి ఎండీ రామకృష్ణంరాజు ఆరు నెలలు ఆర్ఈసీఎస్‌ను సహకార రంగంలోనే నడిపించారు. సర్వసభ్య సమావేశం పెట్టకుండా, ప్రభుత్వ అనుమతి లేకుండా కోట్ల రూపాయల విద్యుత్ పరికరాలు కొనుగోలు చేశారు. అడ్డగోలుగా పలువురికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. వాటిపై ఫిర్యాదులు అందడంతో ఈఆర్సీ ఛైర్మన్ తక్షణమే తమ ముందు హాజరై వివరాలు సమర్పించాలని ఎండీని ఆదేశించడంతో ఉద్యోగం పోతుందనే భయంతో చేసింది తప్పేనని ఒప్పుకొని ఆర్ఈసీఎస్‌ను 2021 సెప్టెంబరులో ఈపీడీసీఎల్‌కు అప్పగించారు. ఆ తరువాత వాటన్నింటిపై విచారణ చేయాలని సహకార శాఖకు చెందిన అధికారిణి శ్యామలను ఉన్నతాధికారులు ఆదేశిస్తే, ఎటువంటి తప్పులు జరగలేదని ఆమె నివేదిక ఇచ్చారు. ఇప్పుడు 51 విచారణ జరుగుతోంది. మరోవైపు ఈపీడీసీఎల్ అధికారులు సిబ్బంది సర్వీసు రిజిస్టర్లన్నీ తిరగేస్తున్నారు. అనర్హుల ఏరివేతకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో ఇవి ముందుకు సాగకుండా ఉండేందుకు ఉద్యోగులు కొందరు వినియోగదారుల పేరిట హైకోర్టును ఆశ్రయించి స్టే తేవాలని ప్రయత్నించారు. అటువంటి చర్యలు తగవని, వారిపై చర్యలకు ఆదేశించాల్సిన విజయవాడ అధికారి ఏమీ తెలియనట్టు, సమాచారం లేదని మిన్నకుండిపోయారు. ఇక్కడ అనకాపల్లి జిల్లా అధికారులు కూడా చర్యలకు తాత్సారం చేస్తున్నారు.

ఏయూలో డిఫెన్స్ కోర్సులకు బ్రేక్?

... 5వ పేజీ తరువాయి

పాఠాల సమయాన్ని బట్టి (గంటలు) ఫీజులు చెల్లిస్తుంటారు.

ఇవీ కోర్సులు..

ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు (పదవీ విరమణ చేయడానికి కొద్దినెలల ముందు), పదవీ విరమణ చేసిన కొందరు ఉద్యోగులకు డీజీఆర్ ఆయా కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తోంది. దీనివల్ల ఉద్యోగ విరమణ తరువాత వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించాలన్నది ఉద్దేశం. ఈ నేపథ్యంలో 2017 నుంచి కొన్ని రకాల కోర్సులను నిర్వహించేలా ఏయూతో ఒప్పందం చేసుకుంది. ప్రస్తుతం యోగా ఇన్‌స్ట్రక్టర్, మెరైన్ ఇంజనీరింగ్, మెరైన్ ఎలక్ట్రికల్ అండ్ నావిగేషన్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ రోబోటిక్స్, ఫైర్ అండ్ ఇండస్ట్రియల్ సేఫ్టీ ఇంజనీరింగ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వంటి కోర్సులను నిర్వహిస్తున్నారు. ఆయా కోర్సుల కాల వ్యవధి మూడు నుంచి ఆరు నెలలు ఉంటుంది.

కొరవడిన స్పష్టత..

ఇప్పటివరకూ కొన్ని వందల మంది డిఫెన్స్‌కు చెందిన ఉద్యోగులు ఇక్కడ కోర్సులు పూర్తిచేశారు. కరోనా సమయంలో మినహా కోర్సుల నిర్వహణలో అంతరాయం ఏర్పడలేదు. తొలిసారి డీజీఆర్ నుంచి కోర్సుల నిర్వహణపై సమాచారం వర్సిటీ అధికారులకు రాలేదు. సాధారణంగా కోర్సులు నిర్వహిస్తుండగానే తదుపరి కోర్సుల కొనసాగింపునకు సంబంధించిన సమాచారం, ఆయా కోర్సుల్లో చేరే వారి జాబితా ఏయూకు చేరుతుంది. ఈ ఏడాది మార్చితో కోర్సులు పూర్తయినప్పటికీ, ఇప్పటివరకూ తదుపరి కోర్సుల్లో చేరే వారి జాబితా, షెడ్యూల్ రాకపోవడంతో సందిగ్ధం నెలకొంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

రౌడీషీటర్ల ఇళ్లలో సోదాలు

... 5వ పేజీ తరువాయి

ఉలిక్కిపడ్డారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచి అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణలో అనుమానాస్పద ప్రాంతాలు, అనుమానిత వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలు పాల్పడే వ్యక్తులు, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వారిని గుర్తించి వారి ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. మొత్తం 525 మంది అధికారులు, సిబ్బంది కలిసి 103 బృందాలుగా ఏర్పడి సుమారు 500 రౌడీషీటర్ల ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కత్తులను, ఎం.వి.పి.స్టేషన్ పరిధిలో ఒక ఇంట్లో కత్తి, రెండు కిలోల గంజాయి, మరొక ఇంట్లో లెక్కలు చూపని సుమారు 6 లక్షల నగదు, 11 తులాల బంగారు ఆభరణాలు, కంచరపాలెం స్టేషన్ పరిధిలో రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నగరంలో ఎటువంటి అసాంఘిక కార్య క్రమాలు జరగకుండా, గంజాయి, ఇతర మత్తు పదార్థాలను పట్టుకునేందుకు ఈ తనిఖీలు నిర్వహించినట్టు పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు.

అన్నదానంలో చేతివాటం!

... 5వ పేజీ తరువాయి

నాణ్యత తగ్గిపోతోంది. ఇంత మొత్తం సమకూర్చడం కష్టంగా ఉండడంతో ప్రసాదాలు పులిహోర, లడ్డూల నాణ్యతను కూడా తగ్గించేస్తున్నారు. ఇటీవల కాలంలో ఓ ఆలయంలో ప్రసాదాల రుచి బాగా పడిపోయిందని దాతలే చెబుతున్నారు. ఇక్కడ జరుగుతున్న వ్యవహారాలపై ప్రజా ప్రతినిధులు పెద్దగా దృష్టిపెట్టడం లేదు. తనిఖీలు కూడా తూతూమంత్రంగానే సాగుతున్నాయి.

ఇంకొందరు అధికారులు మరో అడుగు ముందుకేసి పూజార్ల ప్లేటులో భక్తులు వేసే దక్షిణలోను వాటాలు కోరుతున్నట్టు తెలిసింది. వాస్తవానికి ఆలయ ఖర్చులు ఉంటాయంటూ పూజారులు స్వచ్ఛందంగా కొంత అక్కడి మధ్య స్థాయి సిబ్బందికి ఇస్తుంటారు. కానీ ఇటీవల నెలకు రూ.25 వేలు కావాలని డిమాండ్ చేసి తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయాలకు వెళ్లి మర్యాదలు పొందే ప్రజా ప్రతినిధులు అక్కడ జరుగుతున్న వ్యవహారాలపై దృష్టి పెట్టాల్సిన ఆవశ్యకత ఉంది. ఆకస్మికంగా వెళ్లి భక్తులతో కూర్చొని అప్పుడప్పుడు అన్న ప్రసాదం తింటే...ఇలాంటి అవకతవకలకు చెక్ పెట్టొచ్చు.

పొంచి ఉన్న వ్యాధులు

... 5వ పేజీ తరువాయి

నీటిని తీసుకోవాలని సూచిస్తున్నారు. అదేవిధంగా బయట ఆహారానికి దూరంగా ఉండడంతోపాటు ఇంట్లో కూడా వీలైనంత వరకూ వేడి ఆహారాన్ని తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఫ్లూ జ్వరాలు వ్యాప్తి

సీజన్ మారే సమయంలో కొన్నిరకాల ఫ్లూ వైరస్‌లు వ్యాప్తి చెంది జ్వరాలు బారినపడేలా చేస్తాయి. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమైన తరువాత ఈ తరహా ఫ్లూ వైరస్‌లు యాక్టివేట్ అవుతుంటాయి. అయితే ఈ ఏడాది సీజన్‌లో ఇప్పుడు వర్షాలు కురుస్తున్నందున ఫ్లూ వైరస్‌లు యాక్టివేట్ అయ్యే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. వాతావరణం చల్లగా మారడంతో జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలు వేధించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలను ఇవి ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. రెండు, మూడు రోజులకు మించి జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రతించడం కీలకమని సూచిస్తున్నారు.

దోమల వ్యాప్తికి అవకాశం

వర్షాలతో అనేకచోట్ల నీరు చేరుతుంది. దీనివల్ల దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. మంచి నీటిలో డెంగ్యూ కారక దోమలు వృద్ధి చెంది వ్యాప్తి చెందుతాయి. కాబట్టి, వర్షపు నీరు ఇంటి చుట్టుపక్కల నిల్వ లేకుండా చూసుకోవాలి. వర్షపు నీరు కొన్నాళ్లకు మురికి నీరుగా మారుతుంది. అందులో మలేరియా, తదితర వాటికి కారణమైన దోమలు వృద్ధి చెందుతాయి. కాబట్టి, ఇంటి చుట్టుపక్కల, పూల కుండీల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. దోమలు ఇంట్లోకి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

అప్రమత్తతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చు

వర్షాలు పడిన తరువాత అనేక రకాల వ్యాధులు వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉంది. ముఖ్యంగా కలుషిత నీరు, ఆహారాన్ని తీసుకోవడం ద్వారా డయేరియా, టైఫాయిడ్ వంటి సమస్యలు వస్తాయి. అలాగే ఫ్లూ వైరస్ యాక్టివేట్ అవుతుంది. కాబట్టి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వేడి నీటిని, ఆహారాన్ని తీసుకోవాలి. ఇంట్లో, చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నిల్వ నీటిలో కొన్నిరకాల దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా బారినపడేలా చేస్తాయి.

- డాక్టర్ సోమయాజులు, వైద్య నిపుణులు


రక్తదానం చేస్తున్న యువకులు

యువత రక్తదానం

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదినం సందర్భంగా ఉత్తరాంధ్ర చిరంజీవి యువత ఆధ్వర్యంలో మంగళవారం రక్తదానం, వైద్య శిబిరం నిర్వహించారు. ఎంవీపీ కాలనీ అప్పుఘర్ వద్ద ఆప్ సబ్ కి ఆవాజ్, కేర్ హాస్పిటల్స్, అగర్వాల్ ఐ హాస్పిటల్స్ సహకారంతో వైద్య సేవలు అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం యువ నాయకుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర చిరంజీవి యువత అధ్యక్షుడు ఎలమంచిలి సదాశివరావు, స్థానిక చిరంజీవి యువత అధ్యక్షుడు చీపల్లి ఎల్లాజీ స్వామి, తెలుగుదేశం నాయకుడు గొలగాని పోలారావు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టామని ఎంవీపీ కాలనీ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.మురళి తెలిపారు. స్టేషన్ పరిధిలోని అందరు రౌడీలు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేలా చూస్తున్నామని, కారణం లేకుండా గైర్హాజరయ్యేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవలి కాలంలో రౌడీషీటర్లపై నిఘా పెంచామని, ఒక రౌడీ షీటరు వద్ద కొంత నగదు దొరికిందని, దీనిపై ఆరా తీస్తున్నామన్నారు. మరో రౌడీ వద్ద కత్తి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చిన్న వివాదాల్లో తలదూర్చినా కేసులు నమోదు చేసి, జైలుకు పంపిస్తామన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలపై నేడు అవగాహన సదస్సు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఆగ్రో అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలపై అవగాహన కార్యక్రమాన్ని ఎంవీపీ కాలనీలోని భద్రం సామాజిక భవనంలో బుధవారం నిర్వహించనున్నట్లు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్, టీమ్ ఇండస్ట్రీస్ కన్సల్టెన్సీ, సర్వీసెస్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్త ప్రకటనలో తెలిపాయి. ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరు డీఆర్‌డీఏ కార్యాలయం సమీపంలోని సామాజిక భవనంలో మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 వరకూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నాయి. కొత్తగా వ్యాపారాలు ప్రారంభించదలచినవారు, ఇప్పటికే పరిశ్రమలు నెలకొల్పిన వారికి మార్గదర్శనం చేయడంతో పాటు, ప్రభుత్వ ఎంఎస్ఎంఈ పథకాలు, రుణాలపై అవగాహన కల్పించనున్నారు. వివరాలకు ఫోన్ నెంబరు 80089 38222 లో సంప్రతించాలని సంస్థలు సూచించాయి.

పోలీసుల తనిఖీలు

భీమునిపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సీపీ ఆదేశాల మేరకు పోలీసులు మంగళవారం కార్డెన్ అండర్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. బీచ్‌రోడ్, భీమిలి, తగరపువలసలోని 12 మంది రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల ఇళ్లల్లో ఏకకాలంలో సోదాలు చేశారు. చేపలుప్పాడలో ఒక రౌడీ షీటర్ ఇంట్లో 1.5 కిలోల గంజాయి, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నామని సీఐ తిరుమలరావు తెలిపారు.

సినిమా గైడ్

● వార్-2 : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● కూలీ : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
● సార్, మేడమ్ : మౌర్య (గోపాలపట్నం),
● మహావతార్ నరసింహ : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18,టమాటా 47, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 20, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 22, బీరకాయలు 34, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 42, దొండకాయలు 20, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 64, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వె ల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 68, కీరదోస 30, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34,చిలగడదుంపలు 44, కంద 40,దేముడు చిక్కుడు 65, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160,కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

ఇంటింటా చెత్త సేకరణ శతశాతం జరగాలి

జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి


మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రమణమూర్తి, పాల్గొన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులు

వెంకోజీపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటి నుంచి వ్యర్థాల సేకరణ శత శాతం జరగాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి ప్రజారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జీవీఎంసీ కార్యాలయంలో ప్రజారోగ్య విభాగంపై ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి.నరేష్ కుమార్, ఇతర అధికారులతో పాటు టెలికాన్ఫరెన్స్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులతో సమీక్షించారు. అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వర్షాలు కురుస్తున్నందున ప్రజారోగ్య అధికారులు, పారిశుధ్య కార్మికులు చెత్త పేరుకుపోకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి నూరుశాతం చెత్త సేకరించాలని, చాలా వార్డులలో ఈ పని అనుకున్న స్థాయిలో ఎందుకు జరగడం లేదంటూ ఆయా శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆరా తీశారు. కాలానుగుణ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వారి విధుల పట్ల అంకితభావంతో ఉండి అన్ని పనులు సక్రమంగా నిర్వహించేలా చూడాలని ఆదేశించారు. ఈ నెల 27న వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా అనుమతుల కోసం సింగిల్ విండో క్లియరెన్స్ సెల్ జీవీఎంసీ అన్ని జోనల్ కార్యాలయాలతో పాటు ప్రధాన కార్యాలయంలోనూ ఇప్పటికే ఏర్పాటు చేశామని, సాధ్యమైనంతవరకు జోనల్ కార్యాలయంలోనే అనుమతులు ఇచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సీఎంఓహెచ్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు గెడ్డలు ఎక్కడా పొంగిపొర్లలేదని, నిత్యం వ్యర్థాలను సకాలంలో తొలగించడమే కారణమని తెలిపారు. అపరాధ రుసుం సరిగా వసూలు చేయకపోవడంతో ప్లాస్టిక్ వినియోగం పెరిగే అవకాశం ఉందన్నారు. దుకాణాల ముందు వ్యర్థాలు ఉంటే వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలని, నగరంలో ట్రేడ్ లైసెన్సులు కొత్తగా జారీ చేయడంపై దృష్టి సారించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లను ఆదేశించారు. నగరంలో మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా, వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా కావాల్సిన కెమికల్స్ సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. నగరంలో పందులు, వీధి కుక్కలు, పశువుల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, వీధి కుక్కల నియంత్రణకు ప్రతిరోజు ఆపరేషన్లు, వాక్సినేషన్స్ వేయాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలన్నారు. 40వ వార్డు ఏకేసీ కాలనీ-1 సచివాలయం శానిటరీ కార్యదర్శి సన్యాసిరావు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నందున అతనికి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సహాయ వైద్యాధికారులు, జీవీఎంసీ బయాలజిస్టు, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, మలేరియా సిబ్బంది, వెటర్నరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్ల పార్కింగ్ కోసం కాలువలు మూసేశారు

పారిశుధ్య నిర్వహణ చేపట్టలేని పరిస్థితి



కాలువలు మూసి వేసి కార్లు నిలిపిన దృశ్యం

వెంకోజీపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఒక పక్క 16వ వార్డు.. మరోవైపు 15వ వార్డు...నడి మధ్యన రోడ్డు... వారు గానీ... వీరు గానీ... ఎవరూ.... శుభ్రం చేయలేదు... రెండు వార్డుల శానిటరీ సిబ్బందికి, టౌన్ ప్లానింగ్ అధికారులకైనా ఇది పట్టలేదు.. రానున్న భారీ వర్షాలకు ఈ ప్రాంతంలో కచ్చితంగా రోడ్డుపై వరదలేనని.. తమ ఇండ్లలోకి మురుగునీరు ప్రవాహమేనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదీ ఇసుకతోట కృష్ణమందిరం రోడ్డు పరిస్థితి. ఈ రోడ్డుకు రోడ్డుకు రెండు వైపుల కాలువలు పూర్తిగా మూసుకుపోయి నిర్మాణాలు సాగించారు. పూడ్చేసిన కాలువలను తీయాల్సిన బాధ్యత శానిటేషన్‌కు ఉంది... ఆ కాలువలు కనిపించకుండా కప్పేస్తే ఆక్రమణలను తొలగించి కాలువలను వెలికి తీయాల్సిన బాధ్యత టౌన్‌ప్లానింగ్ పై ఉంది. అయినా అటు శానిటేషన్ వారు కానీ, ఇటు టౌన్ ప్లానింగ్ వారు కానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చిన్న పాటి వర్షం పడితే చాలు ఇక్కడి కృష్ణ మందిరం వద్ద మురుగు నీరు నిలిచిపోయి, రోడ్డంతా మురుగు మయంగా మారుతుంది. మురుగునీరు ఇండ్లలోకి ప్రవహిస్తుంది. ఈ విషయంపై స్థానికులు అనేక మార్లు శానిటేషన్ సిబ్బందికి ఫిర్యాదు చేసిన, ఆ మురుగు చేరినప్పుడు మాత్రం వచ్చి శుభ్రం చేసి వెళ్తున్నారు మరోసారి మురుగు చేరకుండా చర్యలు మాత్రం తీసుకోవడం లేదని వాపోతున్నారు. కాలువలను కప్పేసి మరి నిర్మించిన ఇక్కడి స్వగృహ వారికి గానీ, ఇప్పుడిప్పుడే కాలువపై నిర్మాణ సామాగ్రిని ఉంచి నిర్మించిన బిల్డర్‌పై గానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వ్యక్తమౌతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి తమ సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

ఎంతకాలం గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్‌ని విమర్శిస్తారు..?

కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక దండి

వెంకోజీపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బెంగళూరులోని మహదేవపురలో జరిగిన ఓట్ల చోరీ వ్యవహారం బయటపెట్టినప్పటి నుంచి ప్రధాని మోదీకి మతిపోయిందని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గం ఇంచార్జి ప్రియాంక దండి విమర్శించారు. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె మాట్లాడుతూ దేశ ప్రజానీకం ఓట్ల చోరీని నమ్ముతున్నారని, తెలంగాణలో కేసీఆర్ పదేళ్ల దాటినా ఇప్పటికీప్రత్యేక రాష్ట్ర సెంటిమెంట్‌ని ఎలా ఉపయోగిస్తున్నారో, బీజేపీ కేంద్ర ఎన్నికల సంఘంతో కుమ్మక్కై ఓటు చోరీ అంశాన్ని తప్పుదోవ పట్టించడానికి సింధు జలాల ఒప్పందం నెహ్రూ చేశారంటూ మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. అటల్ బిహారి వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నారని, అప్పుడు నాటి ప్రధానిని ఒప్పించి సింధు జలాల ఒప్పందం ఎందుకు రద్దు చేయలేదని ఆమె ప్రశ్నించారు. గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్‌లను విమర్శించకుండా బీజేపీ రాజకీయం చేయలేదని ఎద్దేవా చేశారు. ప్రజలు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను ఇకపై నమ్మరని ప్రకటనలో పేర్కొన్నారు.

'నగర అభివృద్ధికి సహకరించండి'


కమిషనర్ కేతన్‌గార్గ్‌ను కలిసిన స్థాయీ సంఘం సభ్యులు

వెంకోజీపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా ఎన్నికైన జీవీఎంసీ స్థాయీ సంఘం సభ్యులు మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ కేతన్‌గార్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగాకమిషనర్ సభ్యులను అభినందిస్తూ స్థాయీ సంఘానికి వచ్చిన పనులపై క్షుణ్ణంగా చర్చించి, ఆమోదించి విశాఖ నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

మంత్రి నాదెండ్లను కలిసిన భీమిలి ఏఎంసీ చైర్మన్


మంత్రి మనోహర్‌ను కలిసిన రామస్వామినాయుడు

పద్మనాభం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ కురిమిన రామస్వామినాయుడు నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకులు మంగళవారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నామినేటెడ్ పదవుల్లో తమకు స్థానం కల్పించినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రి మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదవులు పొందిన వారు అలంకారం కోసం కాకుండా ప్రజా సేవ చేస్తూ నిత్యం వారితో మమేకం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేములవలస పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి రౌతు నాగరాజు, నాయకులు బీవీ కృష్ణయ్య, శ్రీకాంత్, ఎం. శ్రీను, వీబీ నాయుడు, రాజు, సాగర్, అప్పలరాజు, బాలు మూర్తి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో నరెడ్కో జాతీయ సదస్సు

- ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహణ - రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్, కో-ప్రధాన కార్యదర్శి వైవీ చౌదరి, ఉత్తర మండల అధ్యక్షుడు ఎ.రమేశ్‌బాబు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎంఏ హుస్సేన్, కోశాధికారి కేవీవీ సుబ్బారావు

పెదవాల్తేరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) 17వ జాతీయ సదస్సు ఈనెల 29,30 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్నట్టు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్ తెలిపారు. ఈమేరకు మంగళవారం పెదవాల్తేరులోని నరెడ్కో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చక్రధర్ మాట్లాడుతూ సదస్సుకు కేంద్ర మంత్రులు పీయూష్‌గోయెల్, మనోహర్ లాల్, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, సాహు, రాష్ట్ర మంత్రి నారాయణ, ఏపీ ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు.ఇందులో సంస్కరణలు, పట్టణ పరివర్తన, రియల్ ఎస్టేట్ అభివృద్ధిపై చర్చిస్తామన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ మొదటి స్థానంలో ఉందని తెలిపారు. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, రెవెన్యూ విభాగం, సేల్ కమ్ జీపీఏ మినహాయింపు, ఆపర్ టేబుల్ హౌసింగ్, సింగిల్ విండో క్లియరెన్స్ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. నరెడ్కో కో-ప్రధాన కార్యదర్శి వైవీ చౌదరి మాట్లాడుతూ సదస్సులో 800 మంది సభ్యులు ఉన్నారని, జాతీయ అధ్యక్షుడిగా తెలుగువారైన జి.హరిబాబు, చైర్మన్‌గా రాజన్ ఎన్ బండేల్కర్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ సదస్సులో అమరావతి అభివృద్ధిపై చర్చించి, దేశవ్యాప్తంగా ప్రజంటేషన్ ఇస్తామని వివరించారు. సమావేశంలో నరెడ్కో ఉత్తర మండల అధ్యక్షుడు ఎ.రమేశ్‌బాబు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎంఏ హుస్సేన్, కోశాధికారి కేవీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


మధురవాడలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి ప్రతిమలు

అమ్మకానికి గణపయ్య ప్రతిమలు సిద్ధం

మధురవాడ/పద్మనాభం రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27వ తేదీ నుంచి జరిగే వినాయక నవరాత్రి ఉత్సవాలకు గణేశ్ ప్రతిమలు సిద్ధమవుతున్నాయి. పర్యావరణహితంగా బంక మట్టి,వరిగడ్డి, ప్రకృతి సహజమైన రంగులతో వీటిని తయారు చేస్తున్నారు. ఒడిశా, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన కళాకారులు రెండు నెలలుగా మధురవాడలో వీటి తయారీలో నిమగ్నమై ఉన్నారు. ఏటా ఈ సీజన్‌కు ముందు వారు ఇక్కడికి వచ్చి మట్టి ప్రతిమలు తయారు చేస్తుంటారు. నాలుగు అడుగుల ఎత్తు నుంచి పదిహేను అడుగులు ఎత్తు వరకు బొమ్మలు తయారు చేస్తున్నారు. ఒక్కొక్క బొమ్మ ధర సైజును బట్టి రూ. 500 నుంచి రూ. 40 వేల వరకూ విక్రయిస్తున్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుల నిరసన


నిరసన తెలుపుతున్న డిగ్రీ అధ్యాపకులు

భీమునిపట్నం,ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తక్షణమే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు మంగళవారం ఆందోళన చేశారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి కళాశాల భవనం ముందు నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నంబరు 42 రద్దు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ప్రిన్సిపాళ్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఈనెల 29న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా జీసీజీటీఏ అధ్యక్షుడు విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రం విడుదల చేస్తున్న పరశురామరాజు, తదితరులు

30న సంచార జాతుల విముక్తి దినోత్సవం

పెదవాల్తేరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సంచార-అర్ధ సంచార జాతుల విముక్తి దినోత్సవం సందర్భంగా మంగళవారం బీజేపీ కార్యాలయంలో స్ఫూర్తి కార్యక్రమం కరపత్రాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామరాజు తదితరులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 30న విజయవాడలో సంచార, అర్ధ సంచార జాతుల విముక్తి దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. వారు 'మట్టిలో మాణిక్యాలు-మన చరిత్రలో వెలిగే దీపాలు' అని అభివర్ణించారు. దేశం నలుమూలలా తిరుగుతూ కళల ఉనికి చాటుతూ ఆచారాలకు రూపం ఇచ్చారన్నారు. సనాతన ధర్మానికి వారధులుగా ఉంటూ సాంస్కృతిక వైభవం, పునరుద్ధరణకు బాటలు వేస్తూ సంచారం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లి శ్రీనివాసులు నాయుడు, రాష్ట్ర కోశాధికారి కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు పలిరెడ్డి శ్రీనివాసరావు, శ్రీరంగం ధనేశ్వరరావు, పోతిన పైడిరాజు, రోణంకి విజయ చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు మూణ్నాళ్ల ముచ్చటేనా?


ఆదర్శనగర్ జాతీయ రహదారి వద్ద వెలిసిన బడ్డీ దుకాణాలు

ఆరిలోవ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 10వ వార్డు ఆదర్శనగర్ జాతీయ రహదారి పక్కన కొత్తగా నిర్మించిన బస్‌షెల్టరు వద్ద ఇష్టానుసారంగా దుకాణాలు వెలిశాయి. దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు కొందరు బ్రోకర్లు కూడా ఉన్నారు. వీరి అండదండలతో ఇక్కడ బడ్డీలు పెట్టి వాటిని అద్దెలకు ఇస్తుంటారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది. కాని ఎవరూ వీటిని పెద్దగా పట్టించుకోవడంలేదు. జీవీఎంసీ అధికారులు తమ బాధ్యత కాదన్నట్లు ముఖం చాటేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. గతంలో 'ఆంధ్రజ్యోతి' ఈ విషయం వెలుగులోకి తేవడంతో జీవీఎంసీ అధికారులు స్పందించి వాటిని తొలగించారు. కొద్దికాలం తరువాత మళ్లీ అదే స్థలంలో దళారుల సహకారంతో అదనంగా మరికొన్ని బడ్డీలు ఏర్పాటు చేశారు. టౌన్ ప్లానింగ్ విభాగం వారు వీటిపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇంట్లోకి కొండచరియలు



వెంకోజీపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 15వ వార్డు అంబేడ్కర్‌నగర్ కొండవాలు ప్రాంతంలో కొండచరియలు విరిగి రాళ్లు ఓ ఇంట్లోకి చొచ్చుకువచ్చాయి. కొండవాలు ఆనుకుని ఉన్న ఓ గ్రూప్ హౌస్‌కు మంగళవారం ఉదయం ఒక్కసారిగా కొండచరియ విరిగి బండరాళ్లు కింద పోర్షన్ కిటికీని తోసుకుంటూ ఇంటిలోకి చొరబడ్డాయి. అయితే ఆ సమయంలో గదిలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. ఇంటిలో నివసిస్తున్న జాతీయ వినియోగదారుల సంఘం చైర్మన్ ఆర్.సాయిరమేష్ కొండ చరియలు విరిగి పడిన గదిని కార్యాలయంగా వినియోగించడం, ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో కేవలం ఆస్తి నష్టం తప్ప ఎటువంటి ప్రమాదం సంభవించలేదన్నారు. ఈవిషయం తెలిసిన వెంటనే కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, ఏఈ భాగ్యశ్రీతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దృష్టికి తీసుకువెళ్తానని, ఇంటిలోకి చొచ్చుకువచ్చిన రాళ్లు, మట్టిని వెంటనే తొలగించమని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. త్వరలోనే ఈ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

శ్రీప్రకాష్‌లో ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం


ప్రదర్శనను తిలకిస్తున్న ఫొటోగ్రాఫర్లు, అతిథులు

విశాఖపట్నం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను అగర్వాల్ ఇమేజెస్ అధినేత బీకే అగర్వాల్ ప్రారంభించారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు నిర్వహించిన పోటీలో 450 మంది తీసిన సుమారు 1400 ఫొటోలను ప్రదర్శనలో ఉంచారు. ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ అశోక్ కందిమల్ల, సీనియర్ జర్నలిస్టు నివేదిత గంగూలీ, సినిమాటోగ్రాఫర్ ఎస్.శ్రీహరివర్మ హాజరయ్యారు. అనంతరం శ్రీప్రకాష్ డైరెక్టర్ వాసు ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సభలో ఫొటోగ్రఫీలోని మెలకువలను విద్యార్థులకు వివరించారు. జూనియర్ విభాగంలో ఎం.సమన్విత, కె.జతిన్, వై.పిరాయి యాజిని, ఫ్లవర్స్ అంశానికి సంబంధించి పి.రాహిత్య, ఎ.సాయివినయ్‌కార్తీక్, సీనియర్స్ విభాగంలో రాజ్‌దీప్ శుక్లా, శ్రావణి, సి జగవంత్ కామేష్, స్ట్రీట్ ఫొటోగ్రఫీ అంశలో డీడీ వాన్షిక, కె.దేవ్‌రోహన్, ఘనశ్యామ్ మీనన్ విజేతలుగా నిలిచారు.

జిల్లా న్యాయస్థానాల్లో ఉద్యోగ నియామకాలకు నేటి నుంచి పరీక్షలు

మహారాణిపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయస్థానాలలో సిబ్బంది నియామకానికి ఈ నెల 20 నుంచి 24 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా తెలిపారు. పరీక్షల నిర్వహణకు హైకోర్టు జారీ చేసిన సూచనలను వివరించారు. కోర్టులో స్టెనోగ్రాఫర్ 3, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితర పోస్టులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలు మూడు షిఫ్టులలో కంప్యూటర్ ఆధారితంగా జరుగుతాయని పేర్కొన్నారు.

అనకాపల్లి జిల్లాలో 736 కిలోల గంజాయి స్వాధీనం

» 22మంది అరెస్టు

అనకాపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు 736 కిలోల గంజాయిని స్వాధీనం చేసున్నారు. ఇందుకు సంబంధించి 22 మందిని అరెస్టు చేశారు. వి.మాడుగుల మండలం శంకరం పంచాయతీ బొడ్డరేవు గ్రామ సమీపంలో 320 కిలోల గంజాయిని సోమవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా 16 మందిని పట్టుకోగా, మరో ముగ్గురు పరారయ్యారని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి మంగళవారం విలేకరులకు తెలిపారు. అలాగే గొలుగొండ మండలం కొమిర శివారు ప్రాంతంలో 216 కిలోల గంజాయిని పట్టుకొని, ముగ్గురిని అరెస్టు చేశారు. అదేవిధంగా పాయకరావుపేట మండలం సీతారాంపురం జంక్షన్ వద్ద సుమారు 200 కిలో గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.కోటి వరకూ ఉంటుందని చెబుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధిత కుటుంబానికి మంజూరుపత్రం అందజేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మర్రిపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్ చెక్కులు)ని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మంగళవారం పంపిణీ చేశారు. మర్రిపాలెం శ్యామ్‌కాలనీలో నివాసముంటున్న కె.లక్ష్మికి రూ.42 వేలు, బి.భానుకు రూ.64 వేల చెక్కులను వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు పెంటకోట అజేయ్‌బాబు, నాయకులు గిరిరాజు, సేనాపతి సురేష్, మదన్, నరేష్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి పూజలు

మహారాణిపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంగళవారం అష్టదళ పద్మారాధన పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ లక్ష్మి పూజలు చేశారు. భక్తులు, ఉభయదాతలు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కేజీహెచ్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్

... 5వ పేజీ తరువాయి

నిధులు ఇవ్వగా, కొనుగోలు ప్రక్రియ దాదాపు తుది దశకు వచ్చినట్టు చెబుతున్నారు. కొనుగోలు చేయనున్న పరికరాల జాబితాలో వెంటిలేటర్లు, మానిటర్లు, ఇతర ఐసీయూ పరికరాలు, అత్యాధునిక పరీక్ష మెషిన్లు ఉంటాయి.

మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉపయుక్తం

క్రిటికల్ కేర్ సెంటర్ అందుబాటులోకి వస్తే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది. పెయిన్ క్లినిక్‌ను కూడా అందులో నిర్వహించాలన్న ఆలోచన ఉంది. కొన్నిరకాల నొప్పులతో బాధపడే వారికి ఈ పెయిన్ క్లినిక్ ఉపయోగపడుతుంది. మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. రాష్ట్రస్థాయిలో పరికరాలు కొనుగోలు చేసి ఇక్కడకు పంపిస్తారు.

-డాక్టర్ ఐ.వాణి,
కేజీహెచ్ సూపరింటెండెంట్

తగ్గుతున్న ఉక్కు ఉత్పత్తి

... 5వ పేజీ తరువాయి

పడిపోయింది. 18వ తేదీన అంటే సోమవారం అది 17,056 టన్నులకు దిగిపోయింది.

ప్లాంటులోని బ్లాస్ట్ ఫర్నేస్‌లో స్టీల్ తయారీకి ఐరన్‌ఓర్ ఫైన్స్‌తో సింటర్ (రసాయన మిశ్రమం) తయారుచేసి ఉపయోగిస్తారు. దీనికి ఉపయోగించే ఐరన్‌ఓర్ ఫైన్స్ తక్కువ ధరకే లభిస్తాయి. వీటితో సింటర్ తయారుచేసి బ్లాస్ట్ ఫర్నేస్‌లో వేయడం వల్ల స్టీల్ ఉత్పత్తి ప్రక్రియ వేగంగా జరుగుతుంది. దీనిపై అవగాహన లేని యాజమాన్య ప్రతినిధులు కొందరు కొనుగోళ్లలో కమీషన్ల కోసం సింటర్ తయారీకి అవకాశం లేకుండా నేరుగా ఉపయోగించే ఐరన్ ఓర్ పెల్లెట్లను లక్షల టన్నుల్లో కొనుగోలుకు ఒప్పందాలు చేసుకున్నారు. ఐరన్‌ఓర్ ఫైన్స్ ధర టన్ను రూ.6 వేలు కాగా పెల్లెట్లు టన్ను రూ.11 వేలు పెట్టి కొంటున్నారు. అదేవిధంగా కోక్ ఓవెన్ బ్యాటరీలకు మరమ్మతులు చేయించకుండా బయట సంస్థల నుంచి కోక్ కొంటున్నారు. గతంలో కోక్ ఓవెన్ బ్యాటరీల ద్వారా రోజుకు 420 వరకు కోక్ పుషింగ్‌లు జరిగేవి. ఇప్పుడు ఆ సంఖ్య 370కి పడిపోయింది. ఇలా తక్కువైన కోక్‌ను బయట పార్టీల దగ్గర టన్నుకు రూ.5 వేలు ఎక్కువ పెట్టి కొంటున్నారు. వీటన్నింటి నేపథ్యంలో గత మూడు నెలల్లో ఉత్పత్తి వ్యయంలో ముడి పదార్థాల వ్యయం 62 శాతం నుంచి 74 శాతానికి పెరిగింది.

కొండవాలు ప్రజల కష్టాలకు త్వరలో చెల్లుచీటీ

» కల్యాణ మండపం నిర్మాణానికి ఎట్టకేలకు శ్రీకారం » బాపూజీ నగర్‌లో రూ.2.5 కోట్లతో పనులు » మూడు నెలల్లో అందుబాటులోకి ..



బాపూజీనగర్‌లో పనులు చేపడుతున్న దృశ్యం

కంచరపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 46, 47, 48 వార్డుల పరిధి కొండవాలు గ్రామాల్లో నివాసం ఉంటున్నవారి ఇళ్లలో వివాహాలు తదితర ఏ శుభకార్యం నిర్వహించాలన్నా అనేక అవస్థలు పడాల్సిందే. రోడ్లు, వీధులే వారికి వేదికలు! తమ వీధిలో కార్యక్రమం జరపాలంటే రోడ్లు బ్లాక్ చేసుకోవాల్సిన పరిస్థితి. ఇలా చేసినప్పుడు ఇతరులు ఇబ్బంది పడుతుంటారు. కప్పరాడ, బాపూజీనగర్, రాంజీ ఎస్టేట్, పల్నాటికాలనీ, శ్రీనివాసనగర్, నీలకంఠనగర్, పెదకొత్తూరు, బర్మాక్యాంప్, జైభారత్ నగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల ప్రజలు ఎటువంటి శుభకార్యం నిర్వహించుకోవాలన్నా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. వీరి కష్టాలకు త్వరలో చెల్లుచీటీ రాయనున్నారు. కొండవాలు ప్రజల అవస్థలు త్వరలోనే తీరనున్నాయి. జీవీఎంసీ 48వ వార్డు పరిధి బాపూజీనగర్‌లో 450 గజాల స్థలంలో జీ+1 విధానంలో సుమారు రూ.2.5 కోట్లు వెచ్చిస్తూ మెగా కల్యాణ మండపం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఇటీవల ఈ పనులకు శంకుస్థాపన కూడా చేశారు. మూడు నెలల వ్యవధిలో నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు కల్యాణ మండపాన్నిఅందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేటర్ చొరవతో పనులు ప్రారంభం...

కొండవాలు ప్రజల ఇబ్బందులను స్వయంగా చూసిన 48వ వార్డు కార్పొరేటర్ గంకల కవిత ప్రత్యేక కృషి, చొరవతోనే బాపూజీనగర్‌లో కల్యాణ మండపం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. జీవీఎంసీ కౌన్సిల్‌లో ప్రత్యేకంగా కొండవాలు ప్రజల సమస్యలను ప్రస్తావించి నిధులు మంజూరయ్యేలా కృషిచేశారని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు స్వయంగా ఆమె చొరవను అభినందించారు. ఇటీవల పునాదుల గోతులు తవ్వి కొంతమేర ప్రాథమిక పనులు చేపట్టినా, ప్రస్తుతం వర్షాలు కురవడంతో గుంతల్లో నీరు చేరింది. అల్పపీడన ప్రభావం దాటిన వెంటనే చకచకా పనులు చేపట్టడానికి నిర్మాణ సామగ్రితో సిద్ధంగా ఉన్నారు.

హెల్మెట్ ఉపయోగంపై అవగాహన



ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ దాశరథి

మర్రిపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శిరస్త్రాణం ప్రాణానికి రక్షణ కవచమని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి అన్నారు. మంగళవారం ఆయన మర్రిపాలెంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా శిరస్త్రాణం ధరించాలన్నారు. అనుకోని ప్రమాదం జరిగినప్పుడు శిరస్త్రాణం ప్రాణాపాయం నుంచి కాపాడుతుందన్నారు. శిరోభారంగా కాకుండా బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అతివేగం, ముగ్గురేసి వెళ్లడం, దూకుడుగా వాహనం నడపడం నేరమని, ఏరికోరి ప్రమాదాల బారినపడి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కంచరపాలెం ట్రాఫిక్ పోలీసుస్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో నగర క్రీడాకారిణులకు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారిణులతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అస్మిత ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ మహిళల వెయిట్ లిఫ్టింగ్ టోర్నీలో బుల్లయ్య కళాశాల విద్యార్థినులు పతకాలు సాధించారు. విజయనగరంలో జరిగిన ఈ టోర్నీ 48 కిలోల విభాగంలో లావణ్య స్వర్ణం, జాహ్నవి, తేజశ్రీ రజత పతకాలు సాధించారు. 53 కిలోల కేటగిరీలో జ్యోత్స్న కాంస్యం, 69 కిలోల విభాగంలో పూజిత రజతం, 86 కిలోల విభాగంలో అమృత కాంస్య పతకం సాధించారు. మంగళవారం కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్, ప్రిన్సిపాల్స్ చక్రవర్తి, సోమేశ్వరరెడ్డి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరక్టర్ డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి తదితరులు పతకాలు సాధించిన విద్యార్థినులను అభినందించారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 22న మెగా జాబ్ మేళా

సీతంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల్లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు దక్షిణ నియోకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు కలసి జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. దక్షిణ నియోజకవర్గంలో నిరుద్యోగ యువతీ, యువకులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పదో తరగతి ఉత్తీర్ణత లేదా తప్పినవారు, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, పీజీ చదివినవారికి ఉద్యోగ అవకాశం ఉందన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ఈ నెల 22న ఉదయం 9 గంటలకు జైలు రోడ్డు వద్ద గల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో దాదాపు 30 కంపెనీలు వెయ్యిమందికి పైగా ఉద్యోగాలకు ఎంపిక చేసేందుకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ హరిప్రసాద్, రూరల్ అధ్యక్షుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, డిప్యూటీ మేయర్ గోవింద రెడ్డి, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ గంగులయ్య, జనసేన పార్టీ యువనేత డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి చాముండేశ్వరి, రమేష్, మంజుల, నియోజకవర్గ ఇంచార్జ్‌లు పాల్గొన్నారు.



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ తదితరులు

'కృత్రిమ మేధ ప్రాధాన్యం గుర్తించండి'



అవగాహన కల్పిస్తున్న డా.మల్లిఖార్జున్

కంచరపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల్లో మంగళవారం విద్యార్థులకు పరిశ్రమ సిద్ధం,కృత్రిమ మేధస్సులో మార్పులు, భవిష్యత్ అవకాశాలు అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌టీడీ) విశాఖపట్టణం చాప్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఉపన్యసించారు. లాబ్ కార్ప్స్ డైరెక్టర్ డా.మల్లిఖార్జున్ కొరిపాడు ముఖ్య అతిథిగా హాజరై ఆసక్తికర అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ మాట్లాడుతూ సాంకేతికత విస్తరణకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. కృత్రిమ మేధలో మార్పులను వివరించారు. ఈ కార్యక్రమంలో డా.ఓఎంఆర్.రావు, ప్రొ.సాంబశివరావు, డా.ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి పథకానికి విస్తృత ప్రచారం కల్పించాలి

ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు



ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు, తదితరులు

ద్వారకాబస్‌స్టేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేసిన స్త్రీశక్తి పథకానికి విస్తృత ప్రచారం కల్పించాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు అధికారులకు, సిబ్బందికి సూచించారు. పథకానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వీటిని బస్సు లోపల వెలుపల, బస్టాపులు, ఆర్టీసీ కాంప్లెక్సుల్లో అతికించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కె.పద్మావతి, తిరుపతి, శ్రీధర్ పాల్గొన్నారు.


ఢిల్లీలో 29, 30 తేదీల్లో నరెడ్కో జాతీయ సదస్సు

పెదవాల్తేరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) 17వ జాతీయ సదస్సును ఈ నెల 29, 30 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్నట్టు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం విశాఖ పెదవాల్తేరులోని నరెడ్కో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చక్రధర్ మాట్లాడుతూ సదస్సుకు కేంద్ర మంత్రులు పీయూష్‌గోయెల్, మనోహర్ లాల్, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, సాహు, రాష్ట్ర మంత్రి నారాయణ, ఏపీ ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. ఇందులో సంస్కరణలు, పట్టణ పరివర్తన, రియల్ ఎస్టేట్ అభివృద్ధిపై చర్చిస్తామన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ మొదటి స్థానంలో ఉందని తెలిపారు. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, రెవెన్యూ విభాగం, సేల్ కమ్ జీపీఏ మినహాయింపు, అఫర్డబుల్ హౌసింగ్, సింగిల్ విండో క్లియరెన్స్ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. నరెడ్కో కోశ్రప్రధాన కార్యదర్శి వైవీ చౌదరి మాట్లాడుతూ సదస్సులో జాతీయ అధ్యక్షుడిగా జి.హరిబాబు, చైర్మన్‌గా రాజన్ ఎన్ బండేల్కర్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. సమావేశంలో నరెడ్కో ఉత్తర మండల అధ్యక్షుడు ఎ.రమేశ్‌బాబు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎంఎ హుస్సేన్, కోశాధికారి కేవీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

కంచరపాలెం ఐటీఐ ప్రాంగణంలో 22న జాబ్‌మేళా

కంచరపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం బాలికల ఐటీఐ ప్రాంగణంలో నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈ నెల 22న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తామని ఉప ప్రాంతీయ ఉపాధి కల్పనాధికారి శ్యాంసుందర్ నిట్టల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, మెడ్‌ప్లస్, అమేయా ఎలక్ట్రానిక్స్ తదితర సంస్థలు పాల్గొంటాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, ఫార్మసీ కోర్సులు చేసిన నిరుద్యోగులు హాజరుకావచ్చు. క్లర్క్, వెహికల్ అసిస్టెంట్, డ్రైవర్, ఫార్మాసిస్టు, ట్రైనీ తదితర ఉద్యోగాలకు అర్హులను ఎంపిక చేయనున్నట్టు శ్యాంసుందర్ పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగులు ముందుగా తమ వివరాలను నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అదేవిధంగా 22న ఉదయం 10 గంటలకు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

ప్రపంచ ట్రాన్స్‌ప్లాంట్ క్రీడలకు రమణయ్య పయనం



విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక ప్రపంచ ట్రాన్స్‌ప్లాంట్ క్రీడా పోటీల్లో నగరానికి చెందిన రైల్వే రిటైర్డ్ ఉద్యోగి రమణయ్య ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ కారణాలతో అవయవ మార్పిడి చేసుకుని ఆరోగ్యవంతులుగా ఉన్నవారికి వివిధ క్రీడాంశాలలో ఏటా క్రీడా పోటీలు నిర్వహిస్తారు. ఇలాంటివారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే ఈ టోర్నీ ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం జర్మనీ ఆతిథ్యమిస్తున్న ఈ క్రీడల్లో నగరానికి చెందిన రమణయ్య లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేసుకున్నవారికి నిర్వహించే టెన్నిస్ టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన శిక్షణ శిబిరంలో పాల్గొని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకున్న రమణయ్య మంగళవారం జర్మనీ చేరుకున్నారు.

మండపాల నిర్వాహకులు మార్గదర్శకాలు పాటించాలి

» మద్యం, మాదకద్రవ్యాలు సేవించి అల్లరి చేస్తే కఠిన చర్యలు » పోలీసు కమిషనర్ బాగ్చి హెచ్చరిక



సమన్వయ కమిటీ సమావేశంలో సూచనలు చేస్తున్న నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

మహారాణిపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరున వినాయక మండపాల ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో భద్రతా చర్యలు, మార్గదర్శకాలపై మంగళవారం పోలీసు కమీషనరేట్‌లో నగర కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో జీవీఎంసీ, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, పోలీసు శాఖ అధికారులు, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ బాగ్చి మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని, దరఖాస్తు చేసిన వెంటనే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. దేవుడి దర్శనం కోసం టికెట్లు ఏర్పాటు చేయరాదని, దేవుడి పేరుతో వ్యాపారం చేయవద్దని సూచించారు. వాహనాల పార్కింగ్ పేరిట రుసుములు వసూలును అంగీకరించబోమన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగేలా రహదార్లకు అడ్డంగా మండపాలను ఏర్పాటుచేయరాదని స్పష్టం చేశారు. మద్యంతాగి మండపాల వద్ద అల్లర్లు చేయరాదని హెచ్చరించారు. డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేస్తామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి, మాదక ద్రవ్యాలు, మద్యం తాగి అల్లరి చేస్తున్నట్లు గుర్తిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. మండపాల వద్ద ముగ్గురు వలంటీర్లు ఉండాలని స్పష్టంచేశారు. బలవంతంగా విరాళాలు వసూలు చేయరాదని, మండపాలలో సీసీ టీవీలు ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ బాగ్చి సూచించారు.

ఆర్ఈసీఎస్‌పై విచారణకు మోకాలడ్డు?

... 5వ పేజీ తరువాయి

ఆర్ఈసీఎస్‌లో జరుగుతున్న విచారణలో ఆ బాగోతాలు బయటకు వస్తాయన్న భయంతో దర్యాప్తు ముందుకు సాగకకుండా సదరు అధికారి అడ్డం పడుతున్నారు. కేసును నీరు గార్చేందుకు యత్నిస్తున్న వర్గానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. మాజీ ఎండీదీ అదే తీరు: ఆర్ఈసీఎస్ పనితీరు బాగా లేదని, ప్రభుత్వం లైసెన్స్ ఇవ్వలేదని పేర్కొంటూ సంస్థను ఈపీడీసీఎల్‌కు అప్పగించాలని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) 2021 మార్చిలో ఆదేశించింది. ఆ ఉత్తర్వును పక్కనపెట్టి అప్పటి ఎండీ రామకృష్ణంరాజు ఆరు నెలలు ఆర్ఈసీఎస్‌ను సహకార రంగంలోనే నడిపించారు. సర్వసభ్య సమావేశం పెట్టకుండా, ప్రభుత్వ అనుమతి లేకుండా కోట్ల రూపాయల విద్యుత్ పరికరాలు కొనుగోలు చేశారు. అడ్డగోలుగా పలువురికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. వాటిపై ఫిర్యాదులు అందడంతో ఈఆర్సీ చైర్మన్ తక్షణమే తమ ముందు హాజరై వివరాలు సమర్పించాలని ఎండీని ఆదేశించడంతో ఉద్యోగం పోతుందనే భయంతో చేసింది తప్పేనని ఒప్పుకొని ఆర్ఈసీఎస్‌ను 2021 సెప్టెంబరులో ఈపీడీసీఎల్‌కు అప్పగించారు. ఆ తరువాత వాటన్నింటిపై విచారణ చేయాలని సహకార శాఖకు చెందిన అధికారిణి శ్యామలను ఉన్నతాధికారులు ఆదేశిస్తే, ఎటువంటి తప్పులు జరగలేదని ఆమె నివేదిక ఇచ్చారు. ఇప్పుడు 51 విచారణ జరుగుతోంది. మరోవైపు ఈపీడీసీఎల్ అధికారులు సిబ్బంది సర్వీసు రిజిస్టర్లన్నీ తిరగేస్తున్నారు. అనర్హుల ఏరివేతకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో ఇవి ముందుకు సాగకుండా ఉండేందుకు ఉద్యోగులు కొందరు వినియోగదారుల పేరిట హైకోర్టును ఆశ్రయించి స్టే తేవాలని ప్రయత్నించారు. అటువంటి చర్యలు తగవని, వారిపై చర్యలకు ఆదేశించాల్సిన విజయవాడ అధికారి ఏమీ తెలియనట్టు, సమాచారం లేదని మిన్నకుండిపోయారు. ఇక్కడ అనకాపల్లి జిల్లా అధికారులు కూడా చర్యలకు తాత్సారం చేస్తున్నారు.

ఏయూలో డిఫెన్స్ కోర్సులకు బ్రేక్?

... 5వ పేజీ తరువాయి

పాఠాల సమయాన్ని బట్టి (గంటలు) ఫీజులు చెల్లిస్తుంటారు.

ఇవీ కోర్సులు..

ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు (పదవీ విరమణ చేయడానికి కొద్దినెలల ముందు), పదవీ విరమణ చేసిన కొందరు ఉద్యోగులకు డీజీఆర్ ఆయా కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తోంది. దీనివల్ల ఉద్యోగ విరమణ తరువాత వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించాలన్నది ఉద్దేశం. ఈ నేపథ్యంలో 2017 నుంచి కొన్ని రకాల కోర్సులను నిర్వహించేలా ఏయూతో ఒప్పందం చేసుకుంది. ప్రస్తుతం యోగా ఇన్‌స్ట్రక్టర్, మెరైన్ ఇంజనీరింగ్, మెరైన్ ఎలక్ట్రికల్ అండ్ నావిగేషన్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ రోబోటిక్స్, ఫైర్ అండ్ ఇండస్ట్రియల్ సేఫ్టీ ఇంజనీరింగ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వంటి కోర్సులను నిర్వహిస్తున్నారు. ఆయా కోర్సుల కాల వ్యవధి మూడు నుంచి ఆరు నెలలు ఉంటుంది.

కొరవడిన స్పష్టత..

ఇప్పటివరకూ కొన్ని వందల మంది డిఫెన్స్‌కు చెందిన ఉద్యోగులు ఇక్కడ కోర్సులు పూర్తిచేశారు. కరోనా సమయంలో మినహా కోర్సుల నిర్వహణలో అంతరాయం ఏర్పడలేదు. తొలిసారి డీజీఆర్ నుంచి కోర్సుల నిర్వహణపై సమాచారం వర్సిటీ అధికారులకు రాలేదు. సాధారణంగా కోర్సులు నిర్వహిస్తుండగానే తదుపరి కోర్సుల కొనసాగింపునకు సంబంధించిన సమాచారం, ఆయా కోర్సుల్లో చేరే వారి జాబితా ఏయూకు చేరుతుంది. ఈ ఏడాది మార్చితో కోర్సులు పూర్తయినప్పటికీ, ఇప్పటివరకూ తదుపరి కోర్సుల్లో చేరే వారి జాబితా, షెడ్యూల్ రాకపోవడంతో సందిగ్ధం నెలకొంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

రౌడీషీటర్ల ఇళ్లలో సోదాలు

... 5వ పేజీ తరువాయి

ఉలిక్కిపడ్డారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచి అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణలో అనుమానాస్పద ప్రాంతాలు, అనుమానిత వ్యక్తులు, అసాంఘిక కార్యకలా పాలు పాల్పడే వ్యక్తులు, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వారిని గుర్తించి వారి ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. మొత్తం 525 మంది అధికారులు, సిబ్బంది కలిసి 103 బృందాలుగా ఏర్పడి సుమారు 500 రౌడీషీటర్ల ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కత్తులను, ఎం.వి.పి.స్టేషన్ పరిధిలో ఒక ఇంట్లో కత్తి, రెండు కిలోల గంజాయి, మరొక ఇంట్లో లెక్కలు చూపని సుమారు 6 లక్షల నగదు, 11 తులాల బంగారు ఆభరణాలు, కంచరపాలెం స్టేషన్ పరిధిలో రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నగరంలో ఎటువంటి అసాంఘిక కార్య క్రమాలు జరగకుండా, గంజాయి, ఇతర మత్తు పదా ర్థాలను పట్టుకునేందుకు ఈ తనిఖీలు నిర్వహించినట్టు పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు.

అన్నదానంలో చేతివాటం!

... 5వ పేజీ తరువాయి

నాణ్యత తగ్గిపోతోంది. ఇంత మొత్తం సమకూర్చడం కష్టంగా ఉండడంతో ప్రసాదాలు పులిహోర, లడ్డూల నాణ్యతను కూడా తగ్గించేస్తున్నారు. ఇటీవల కాలంలో ఓ ఆలయంలో ప్రసాదాల రుచి బాగా పడిపోయిందని దాతలే చెబుతున్నారు. ఇక్కడ జరుగుతున్న వ్యవహారాలపై ప్రజా ప్రతినిధులు పెద్దగా దృష్టిపెట్టడం లేదు. తనిఖీలు కూడా తూతూమంత్రంగానే సాగుతున్నాయి.

ఇంకొందరు అధికారులు మరో అడుగు ముందుకేసి పూజార్ల ప్లేటులో భక్తులు వేసే దక్షిణలోను వాటాలు కోరుతున్నట్టు తెలిసింది. వాస్తవానికి ఆలయ ఖర్చులు ఉంటాయంటూ పూజారులు స్వచ్ఛందంగా కొంత అక్కడి మధ్య స్థాయి సిబ్బందికి ఇస్తుంటారు. కానీ ఇటీవల నెలకు రూ.25 వేలు కావాలని డిమాండ్ చేసి తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయాలకు వెళ్లి మర్యాదలు పొందే ప్రజా ప్రతినిధులు అక్కడ జరుగుతున్న వ్యవహారాలపై దృష్టి పెట్టాల్సిన ఆవశ్యకత ఉంది. ఆకస్మికంగా వెళ్లి భక్తులతో కూర్చొని అప్పుడప్పుడు అన్న ప్రసాదం తింటే...ఇలాంటి అవకతవకలకు చెక్ పెట్టొచ్చు.

పొంచి ఉన్న వ్యాధులు

... 5వ పేజీ తరువాయి

నీటిని తీసుకోవాలని సూచిస్తున్నారు. అదేవిధంగా బయట ఆహారానికి దూరంగా ఉండడంతోపాటు ఇంట్లో కూడా వీలైనంత వరకూ వేడి ఆహారాన్ని తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఫ్లూ జ్వరాలు వ్యాప్తి

సీజన్ మారే సమయంలో కొన్నిరకాల ఫ్లూ వైరస్‌లు వ్యాప్తి చెంది జ్వరాలు బారినపడేలా చేస్తాయి. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమైన తరువాత ఈ తరహా ఫ్లూ వైరస్‌లు యాక్టివేట్ అవుతుంటాయి. అయితే ఈ ఏడాది సీజన్‌లో ఇప్పుడు వర్షాలు కురుస్తున్నందున ఫ్లూ వైరస్‌లు యాక్టివేట్ అయ్యే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. వాతావరణం చల్లగా మారడంతో జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలు వేధించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలను ఇవి ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. రెండు, మూడు రోజులకు మించి జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రతించడం కీలకమని సూచిస్తున్నారు.

దోమల వ్యాప్తికి అవకాశం

వర్షాలతో అనేకచోట్ల నీరు చేరుతుంది. దీనివల్ల దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. మంచి నీటిలో డెంగ్యూ కారక దోమలు వృద్ధి చెంది వ్యాప్తి చెందుతాయి. కాబట్టి, వర్షపు నీరు ఇంటి చుట్టుపక్కల నిల్వ లేకుండా చూసుకోవాలి. వర్షపు నీరు కొన్నాళ్లకు మురికి నీరుగా మారుతుంది. అందులో మలేరియా, తదితర వాటికి కారణమైన దోమలు వృద్ధి చెందుతాయి. కాబట్టి, ఇంటి చుట్టుపక్కల, పూల కుండీల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. దోమలు ఇంట్లోకి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

అప్రమత్తతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చు

వర్షాలు పడిన తరువాత అనేక రకాల వ్యాధులు వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉంది. ముఖ్యంగా కలుషిత నీరు, ఆహారాన్ని తీసుకోవడం ద్వారా డయేరియా, టైఫాయిడ్ వంటి సమస్యలు వస్తాయి. అలాగే ఫ్లూ వైరస్ యాక్టివేట్ అవుతుంది. కాబట్టి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వేడి నీటిని, ఆహారాన్ని తీసుకోవాలి. ఇంట్లో, చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నిల్వ నీటిలో కొన్నిరకాల దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా బారినపడేలా చేస్తాయి.

- డాక్టర్ సోమయాజులు, వైద్య నిపుణులు



గ్రీన్ సిటీలోని శ్రీవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

శ్రీవారికి ఏకాదశి పూజలు

కూర్మన్నపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు పరిధి రాజులపాలెంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో, 71వ వార్డు శ్రీనగర్ శ్రీకృష్ణ ఆలయంలో, 88వ వార్డు యాదవ జగ్గరాజుపేట సమీప గ్రీన్ సిటీలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శ్రీవారికి మంగళవారం శ్రావణ ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. గ్రీన్ సిటీ శ్రీవారిని బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. పలువురు భక్తులు అన్నమాచార్యుని భక్తి గీతాలను ఆలపించారు.

జీవీఎంసీ కమిషనర్‌కు వినతి

అగనంపూడి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ కేతన్ గార్గ్‌కు మంగళవారం కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మీప్రసాద్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్డులో గల సమస్యలను వివరించారు. ముఖ్యంగా అగనంపూడి ఆంజయనేయ స్వామి ఆలయ కూడలి నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని, తలారివాని పాలెం రైల్వే ట్రాక్ వద్దనున్న వంతెనను విస్తరించాలని, బొర్రమాంబ ఆలయం వెనుక గల ఖాళీ స్థలంలో నడక ఫైదానాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కూటమి నాయకులు బి.చందూరమేశ్, బి.సత్యనారాయణ, అచ్యుత్, తదితరులు ఉన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ

అగనంపూడి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి సత్రం జంక్షన్‌లో మంగళవారం బొర్రమాంబ పారాయణ సమితి ఆధ్వర్యంలో అనాథలు, యాచకులు, వృద్ధులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. సేవా సమితి సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతి వారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సమితి ఆర్గనైజర్ చిత్రా రామారావు తెలిపారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు జానకి, పద్మ, శోభారాణి, వెంకటలక్ష్మి, కె.అర్జునమ్మ, సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శులకు సత్కారం

అగనంపూడి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి బీసీ కాలనీ సచివాలయానికి బదిలీపై వచ్చిన కార్యదర్శులను మంగళవారం కూటమి నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని, ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులకు అందించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు కొర్రాయి జగదీశ్, మేడిశెట్టి వెంకటేశ్వరరావు, తలారి వాసు, అన్నపూర్ణ, పి.యుగంధర్, గురుమూర్తి, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),

● **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),

● **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 47, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 20, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 22, బీరకాయలు 34, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 42, దొండకాయలు 20, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 64, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 68, కీరదోస 30, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 65, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

ఎందుకిలా చేస్తున్నారో..

అభివృద్ధి చేసిన రోడ్డును పదేపదే తవ్వుతుండడంపై వెల్లువెత్తుతున్న విమర్శలు

ప్రజాధనాన్ని అధికారులు దుర్వినియోగం చేస్తున్నారని ప్రజల ఆవేదన



భూగర్భ విద్యుత్ లైన్ కోసం వుడా కాలనీ రోడ్డును తవ్విన దృశ్యం

గాజువాక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసిన రహదారులను పలుమార్లు తవ్వడం వల్ల ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో అండర్ గ్రౌండ్ డ్రేనేజీ పేరిట ఒకసారి, తాగునీటి పైప్ లైన్ల పేరిట మరోసారి, గ్యాస్ లైన్ కోసం అంటూ ఇంకోసారి... ప్రస్తుతం భూగర్భ విద్యుత్ లైన్ కోసం ఇక్కడి వుడా రోడ్డులో తవ్వకాలు చేపడుతుండడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసిన రోడ్డును ఏదో ఒక పని పేరిట తవ్వడం దారుణమని, అసలు అధికారులు ఎందుకిలా చేస్తున్నారో అర్థం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. గాజువాక వంటిళ్ల జంక్షన్ నుంచి వుడా కాలనీ వరకు గల రోడ్డును ఏడాదిన్నర క్రితం పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. అభివృద్ధి చేసిన ఆరేడు నెలలకే తవ్వకాలు చేపట్టి అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించారు. మళ్లీ అదే రోడ్డును ఏడాది తరువాత మరోసారి తవ్వి తాగునీటి పైపు లైన్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం భూగర్భ విద్యుత్ లైన్ కోసం తవ్వుతున్నారు. ఒకసారి రహదారిని తవ్విన తరువాత మళ్లీ పూడ్చివేసేందుకు లక్షలాది రూపాయలను అధికారులు వెచ్చిస్తున్నారు. ఇలా చాలాసార్లు కొత్తగా వేసిన రోడ్డును తవ్వడ.. మళ్లీ అభివృద్ధి చేయడం వల్ల ప్రజా ధనం రూ.లక్షల్లో వృథా అవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్లే ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని విమర్శలు గుప్పిస్తున్నారు. నూతనంగా రోడ్డును అభివృద్ధి చేసిన సమయంలోనే సంబంధిత విభాగాల అధికారులు సమన్వయం చేసు కుని ఆయా పనులను చేపడితే ఇన్నిసార్లు రోడ్లను తవ్వాల్సిన అవసరం ఉండదని ప్రజలు పేర్కొంటున్నారు.

ఉక్కు అఖిలపక్ష నాయకుల పోరుబాట

పలు విభాగాల ప్రైవేటీకరణ నోటిఫికేషన్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్

24న ఉక్కు నిర్వాసిత కాలనీల్లో ర్యాలీలు, సమావేశాలు

29న స్టీల్ ప్లాంట్ ప్రధాన గేటు నుంచి కొత్త గాజువాక వరకు భారీ బైకు ర్యాలీ

31న కూర్మన్నపాలెం కూడలి వద్ద ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక నేత డి.ఆదినారాయణ

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులోని కీలక విభాగాల ప్రైవేటీకరణకు ఇచ్చిన నోటిఫికేషన్లను ఉపసంహించుకునేంత వరకు ఉక్కు యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు నిర్ణయించారు. ఈ మేరకు ప్లాంటులోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. తమ పోరాటంలో భాగంగా ఈ నెల 24న ఉక్కు నిర్వాసిత కాలనీల్లో సమావేశాలు, ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించాలని, 29వ తేదీ సాయంత్రం స్టీల్ ప్లాంట్ ప్రధాన గేటు నుంచి కొత్త గాజువాక వరకు భారీ ఎత్తున ద్విచక్ర వాహనాల ర్యాలీ చేపట్టాలని నిర్ణయించారు.

అలాగే 31న కూర్మన్నపాలెం కూడలి వద్ద పెద్దఎత్తున ధర్నా చేస్తామని నాయకులు తెలిపారు. గాజువాక, పెందుర్తి ఎమ్మెల్యే లతో పాటు విశాఖ, అనకాపల్లి ఎంపీలు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుని కమిటీ నాయకులు కలిసి ఈవోఐల వల్ల జరిగే నష్టాలను వివరిస్తామన్నారు. అంతేకాక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లతో సమావేశం ఏర్పాటు చేయాలని స్థానిక నాయకత్వంపై ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు. ఈవోఐను రద్దు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తెవాలని డిమాండ్ చేశారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని కోరారు. సమావేశంలో నాయకులు డి.ఆదినారాయణ, కేఎస్ఎన్ రావు, జె.అయోధ్యరాం, మంత్రి రాజశేఖర్, పీవీ రమణమూర్తి, డొక్కా నరసింగరావు, జె.రామకృష్ణ, మసేన్ రావు, వరసాల శ్రీనివాసరావు, కొమ్మినేని శ్రీనివాసరావు, వైటీ దాను, శ్రీనివాసరాజు, జి.గణపతిరెడ్డి, నమ్మి సింహాద్రి, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

'నోటిఫికేషన్లను ఉపసంహరించుకోవాలి'

పెదగంట్యాడ: స్టీల్ ప్లాంటులోని 32 విభాగాల ప్రైవేటీకరణకు యాజమాన్యం జారీ చేసిన నోటిఫికేషన్లను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఇంటక్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు వంశీకృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వందలాది మంది ఉక్కు నిర్వాసితులను తొలగించడంతో వారు కుటుంబాలతో రోడ్డునపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు 32 విభాగాలను ప్రైవేటీకరిస్తే మరింత మంది పనులు కోల్పోయే ప్రమాదం ఉందని, అందువల్ల ఈ నోటిఫికేషన్లను ఉపసంహరించుకోవాలని కోరారు.

హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు వనజాక్షి

పెదగంట్యాడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన కోసం మహిళలంతా ఐక్యంగా ముందుకు సాగాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కె.వనజాక్షి అన్నారు. లంబోదర స్త్రీశక్తి టిడ్కో అభివృద్ధి సంక్షేమ సంఘాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇక్కడి పోతిన సన్యాసిరావు భవన్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళల సాధికారతే లక్ష్యంగా పనిచేస్తే అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం లంబోదర స్త్రీశక్తి టిడ్కో అభివృద్ధి సంక్షేమ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షురాలిగా కె.రమణి, ఉపాధ్యక్షులుగా బి.ప్రమీల, కె.వనజాక్షి, కార్యదర్శిగా పి.లక్ష్మి, సహాయ కార్యదర్శులుగా జె.జయలక్ష్మి, సీహెచ్ ఉమాదేవి, కోశాధికారిగా ఎస్.లక్ష్మి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్.మోహిని, కార్యవర్గం సభ్యులుగా మరో ఆరుగురు ఎన్నికయ్యారు.

'ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం'

గాజువాక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని టీడీపీ 65వ వార్డు అధ్యక్షుడు రట్టి వాసు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కూటమి పాలనలో ప్రజలంతా ఆనందంగా ఉన్నామని చెబుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అంగ కృష్ణ, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఉమ, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గణబాబు, తదితర నాయకులు

ఘనంగా నర్సింగబిల్లి అమ్మవారి పండుగ


» పూజల్లో పాల్గొన్న నేతలు



అమ్మవారిని దర్శించుకున్న మేయర్ పీలా

వేపగుంట ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నాయుడుతోట పరిసర గ్రామాల ఆరాధ్య దైవం నర్సింగబిల్లి అమ్మవారి ప్రధాన పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజామునే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వార్డు కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బల్ల శ్రీనివాసరావు, దాడి వెంకటరమేశ్ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం 1000 మందికి అన్నసమారాధన చేశారు. సాయంత్రం నిర్వహించిన వివిధ సంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పోలమాంబ ఉత్సవం



పోలమాంబ అమ్మవారు

మల్కాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ కాలనీలో కొలువైన పోలమాంబ అమ్మవారి ఆలయంలో వార్షిక పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్-రాంజీ సంక్షేమ సంఘం అమ్మవారికి చదనపట్టును ఏర్పాటు చేశారు. తొలుత భక్తులు అమ్మవారికి చదనపట్టు వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పలువురు దర్శించుకున్నారు. కాలనీలో మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వంతెన ప్రారంభానికి రంగం సిద్ధం



వంతెన నిర్మాణం దాదాపు పూర్తయిన దృశ్యం



లారీపై తరలిస్తున్న పాత వంతెన శిథిలాలు

మల్కాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డాక్‌యార్డు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన ప్రారంభోత్సవం సెప్టెంబర్‌కు వాయిదా పడింది. దాదాపు రూ. 26 కోట్ల పోర్టు నిధులతో గుజరాత్‌కు చెందిన ఓ కంపెనీ ఈ వంతెనను నిర్మిస్తోంది. పాత వంతెనను తొలగించి దాని స్థానంలో ఈ నిర్మాణాన్ని చేపట్టారు. ఆగస్టు 31వ తారీఖున ఈ వంతెన ప్రారంభిస్తామని పోర్టు ఛైర్మన్ చెప్పారు కానీ కొన్ని కారణాల వల్ల నిర్మాణ పనులు ఆలస్యమై ప్రారంభోత్సవం సెప్టెంబర్ 30కు వాయిదా పడింది. ఒకవేళ అప్పుడు కూడా కుదరక పోతే అక్టోబర్ మొదటి వారంలో ప్రారంభించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 330 మీటర్లు పొడవు, 10.5 మీటర్లు వెడల్పు ఉన్న ఈ వంతెన నిర్మాణం తరువాత 70ఏళ్లు ఉంటుందని కాంట్రాక్టర్లు తెలిపారు. మొట్టమొదటిసారి విశాఖపట్నం సముద్రం మీద వంతెన నిర్మిస్తున్నారని అధికారులు పేర్కొన్నారు. ఈ వంతెన ప్రారంభం కోసం ఆటోనగర్, పారిశ్రామిక ప్రాంతం, గాజువాక ప్రాంతాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రౌడీ షీటర్ల ఇళ్లలో పోలీసుల తనిఖీలు



తనిఖీలు చేసిన పోలీస్ బృందాలు

పెందుర్తి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ల ఇళ్లలో మంగళవారం సీఐ కేవీ.సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు స్థానికుల దగ్గర నుంచి రౌడీషీటర్ల ప్రవర్తన, కదలికలపై సమాచారం సేకరించారు.శాంతి భద్రతలకు భంగం కలకుండా అందరితోను మంచిగా మెలగాలని రౌడీషీటర్లకు పోలీసులు సూచించారు. ఈ తనిఖీల్లో తొమ్మిది పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో స్టేషన్ సిబ్బంది 25, ఏఆర్ పోలీసులు 6 పాల్గొన్నారు.

నిరాశ్రయులకు ఆశ్రయం

నగర పరిధిలో అనాథల్లా రోడ్లపై తిరుగుతున్న నిరాశ్రయులకు పెందుర్తి పోలీసులు ఆశ్రయం కల్పించార. వారం రోజులుగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో 45 మందిని చేర్పించారు. ఈ నేపథ్యంలో ముగ్గురి సమాచారం తెలియడంతో వారి బంధువులకు అప్పగించారు.

తుపాకీల కోసం తనిఖీలు

మల్కాపురం, (ఆంధ్రజ్యోతి): మల్కాపురం పోలీసులు రౌడీషీటర్లు, అనుమానితుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో తుపాకీ కాల్పులు జరిగిన నేపథ్యంలో ఏమైనా మారణాయుధాలు రౌడీషీటర్ల ఇళ్లల్లో ఉన్నాయనే అనుమానంతో తనిఖీలు నిర్వహించారు. కానీ ఎవరి ఇళ్లల్లోని ఆయుధాలు దొరక్క పోవడంతో వాళ్లకు పలు సూచనలు చేశారు.

రహదారి నిర్మాణంతో తీరిన కష్టాలు

» ఆనందోత్సవాల్లో స్థానిక ప్రజలు



సంతోష్‌నగర్ కాలనీ నుంచి వెంకటాపురం వరకు ఇటీవల నిర్మించిన రహదారి

గోపాలపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా ప్రతిపాదనకే పరిమితమైన కొత్తపాలెం, వెంకటాపురం గ్రామాల మధ్య ఎట్టకేలకు రహదారి నిర్మించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్తపాలెం నుంచి వెంకటాపురం గ్రామానికి రహదారి నిర్మాణానికి దశాబ్దాలుగా ప్రతిపాదన ఉంది.

ప్రభుత్వాలు మారినా రహదారి నిర్మాణం రూపుదాల్చకపోవడంతో స్థానికులు ప్రత్యామ్నాయ మార్గంలో రాకపోకలు సాగించేవారు. ఇటీవల నిధులు మంజూరు చేసి రహదారి నిర్మాణం చేపట్టారు. దీంతో కొత్తపాలెం, వెంకటాపుం గ్రామాల ప్రజలకే కాకుండా నరవ, జెర్రిపోతులపాలెం, చింతగట్ల గ్రామాల ప్రజలు ఈ మార్గం నుంచి గోపాలపట్నం బీఆర్‌టీఎస్‌కు చేరుకుంటున్నారు. చిరకాల సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గొడౌన్లకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న వీఎంఆర్డీఏ అధికారులు

గొడౌన్ల ఏర్పాటు స్థలాన్ని పరిశీలించిన వీఎంఆర్డీఏ అధికారులు

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 68వ వార్డు పరిధిలోని కాలనీలను కాలుష్యం నుంచి కాపాడాలంటు అఖిలపక్ష కమిటీ నాయకులు చేసిన వినతులకు ఎట్టకేలకు అధికారులు స్పందించారు. వార్డుకు ఆనుకుని ఉన్న విశాఖ పోర్టు స్థలాన్ని పలు సంస్థలకు గొడౌన్ల నిర్మాణానికి కేటాయించడాన్ని నిరసిస్తూ అక్కిరెడ్డిపాలెం,మింది, పంచవటి కాలనీల ప్రజలు అఖిలపక్ష కమిటీగా ఏర్పడి గత కొద్దిరోజులుగా ఆందోళనలు చేపడుతుండడంతో పాటు అధికారులకు వినతులు అందజేస్తున్నారు. ఇందుకు స్పందించిన వీఎంఆర్డీఏ అధికారులు మంగళవారం గొడౌన్ల నిర్మాణ ప్రదేశాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా 500 మీటర్ల వరకు బఫర్ జోన్‌ను ఏర్పాటు చేయకుండా పంచవటి కాలనీ, మింది, అక్కిరెడ్డిపాలెం కాలనీలకు ఆనుకుని ప్రమాదాకర పదార్థాలను నిల్వ చేసేత గొడౌన్ల నిర్మాణానికి పోర్టు యాజమాన్యం అనుమతులివ్వడం సరికాదని అఖిలపక్ష కమిటీ నాయకులు ఆరోపించారు. ఇక్కడ బఫర్ జోన్‌ను ఏర్పాటు చేసి కాలుష్యం నుంచి ఆయా కాలనీల ప్రజలకు ఆదుకోవాలని కమిటీ నాయకులు గుడివాడ లతీశ్, సంద్రాన నూకరాజు, పి.చిన్నారావు, మురళీ, తదితరులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

పోర్టు కార్యదర్శికి కార్పొరేటర్ వినతి

అక్కిరెడ్డిపాలేనికి ఆనుకుని బీపీసీఎల్ సంస్థ గొడౌన్ల నిర్మాణానికి అనుమతి వ్వరాదని పోర్టు సెక్రటరీ వేణుగోపాల్‌ను 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష కోరారు. ఈ గొడౌన్ల నిర్మాణం వల్ల కాలుష్య సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు.

రౌడీ షీటర్ల ఇళ్లలో పోలీసుల సోదాలు



ఓ రౌడీ షీటర్ ఇంట్లో తనిఖీలు చేస్తున్న సీఐ పార్థసారథి, సిబ్బంది

గాజువాక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో గల రౌడీ షీటర్ల ఇళ్లలో మంగళవారం పోలీసులు ఆకస్మిక సోదాలు చేపట్టారు. వారి ఇళ్లలో అనుమానాస్పద వస్తువులు, గంజాయి వంటివి ఉన్నాయేమోనని క్షుణ్ణంగా తణిఖీలు జరిపారు. రౌడీ షీటర్లందరూ సత్ప్రవర్తనతో మెలగాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వాకికి హెచ్చరించారు.



సభలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

ప్రభుత్వం చేస్తున్న మంచి ప్రజలకు తెలియజేయాలి

» పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిందని, ఈ ఏడాదిలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు తెలియజేయాలని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. నియోజకవర్గం కేంద్ర కార్యాలయంలో టీడీపీ నేతలతో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలపై వైసీపీ నాయకుల వదంతులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ అనుబంధ కమిటీల నియామకం త్వరితగతిన పూర్తి చేయాలని వార్డు నేతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కార్పొరేటర్‌లు, వార్డు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెందుర్తిలో ఫొటోగ్రఫీ దినోత్సవం



లూయిస్ డాగ్యురే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఫొటో గ్రాఫర్లు

పెందుర్తి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పెందుర్తి 'ప్రొఫెషనల్ ఫొటో అండ్ విడియోగ్రఫీ' అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ ఫొటోగ్రఫి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు శరగడం రాము సంఘం సభ్యులు ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక లయోలో వృద్ధాశ్రమంలో కేకు కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం పండ్లు, రొట్టెలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయానికి కలశాల బహూకరణ



బహుకరించిన కలశాలతో దాతలు

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో కొలువైన దుర్గాలమ్మ, బంగారమ్మ అమ్మవార్లకు స్థానిక కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపులు ఎమ్ఎస్ఎన్ పాత్రుడు విజయలక్ష్మి దంపతులు వెండితో తయారు చేసిన 9 కలశాలను, అన్నదానానికి రూ.5వేలను ఆలయకమిటీకి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వాళ్ల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో 600 మందికి అన్నదానం చేశారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రాణం నిలిపే సంజీవని!





బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు వరం టెనెక్ట్‌ప్లాజ్ ఇంజక్షన్

- విమ్స్, కేజీహెచ్‌లో రోగులకు ఉచితం
- ఒక్కో ఇంజక్షన్ ఖరీదు రూ.40 వేలు
- బాధితులకు సాంత్వన చేకూరుస్తున్న వైనం
- సకాలంలో రోగులను ఆస్పత్రికి తీసుకురావడమే కీలకం
- ఇంజక్షన్ ఇచ్చిన మూడు గంటల్లో రోగి సాధారణ స్థితికి

విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):

బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు సంజీవనిగా నిలుస్తోంది టెనెక్ట్‌ప్లాజ్ ఇంజక్షన్. అత్యంత ఖరీదైన దీనిని కేజీహెచ్, విమ్స్ ఆస్పత్రుల్లో రోగులకు ఉచితంగా అందిస్తున్నారు. బ్రెయిన్ స్ట్రోక్ బారినపడిన బాధితులకు ఈ ఇంజక్షన్‌ను మూడు నుంచి నాలుగు గంటల్లోగా ఇస్తే రోగి వేగంగా కోలుకునేలా చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ ఇంజక్షన్‌ను మార్కెట్‌లో కొనుగోలు చేయాలంటే కనీసం రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. విమ్స్‌లో నెలకు సగటున పది మందికి, కేజీహెచ్‌లో 20 మందికి ఉచితంగా ఇంజక్షన్లు అందించి వారి ప్రాణాలు నిలబెడుతున్నారు.



బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన బాధితులకు వెంటనే ఈ ఇంజక్షన్ ఇవ్వడం వల్ల మెరుగైన ఫలితం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అయితే చాలా మందిలో అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు కనిపించిన వెంటనే ఈ రెండు ఆస్పత్రులకు తీసుకువస్తే ఉచితంగా ఇంజక్షన్ పొందవచ్చని సూచిస్తున్నారు.

ఇవీ లక్షణాలు..

బ్రెయిన్ స్ట్రోక్ బాధితుల్లో చేతులు తిమ్మిర్లు ఎక్కడం, మూతి వంకర పోవడం, కాళ్లు, చేతులు తీవ్రమైన నీరసంగా ఉండడం, కొన్నిసార్లు ఫిట్స్ వచ్చినట్టు కొట్టుకోవడం, కళ్లు తిరిగి కింద పడిపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. ఈ స్థితిలో వెంటనే ఆస్పత్రిలో చేర్చాలి. లక్షణాలను బట్టి సీటీ స్కాన్ చేసి నిర్ధారించి ఇంజక్షన్ అందిస్తారు.

గోల్డెన్ అవర్‌లో చేర్చాలి..

బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన బాధితుడిని మూడు నుంచి నాలుగున్నర గంటల్లో ఆస్పత్రిలో చేర్చాలి. దీనిని గోల్డెన్ అవర్ అంటారు. ఈ సమయంలో చేర్చిన రోగులకు మాత్రమే ఇంజక్షన్ ఇవ్వడానికి అవకాశం ఉంది. సీటీ స్కాన్ పరీక్ష చేసి ఇంజక్షన్ ఇవ్వవచ్చా? లేదా.? అన్నది వైద్యులు నిర్ధారిస్తారు. బ్రెయిన్ స్ట్రోక్ బాధితుల్లో చాలా మందికి రక్తం గడ్డకడుతుంది. ఇలాంటి వారికి మాత్రమే ఈ ఇంజక్షన్ ఇచ్చే అవకాశం ఉంది. కొందరికి బ్రెయిన్‌లో రక్తం బ్లీడ్ అవుతుంది. వారికి ఇంజక్షన్ ఇవ్వడం వల్ల ఫలితం ఉండదు. గడ్డ కట్టిన రక్తాన్ని కరిగించేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఇంజక్షన్ ఇచ్చిన మూడు గంటల్లోనే రోగి సాధారణ స్థితికి చేరుకుంటాడని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చినట్టు గుర్తిస్తే వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లి ఈ ఇంజక్షన్ చేయించుకోవాలని సూచిస్తున్నారు.

పెరుగుతున్న బాధితులు..

గతంతో పోలిస్తే బ్రెయిన్ స్ట్రోక్ బారినపడుతున్న వారి సంఖ్య పెరిగింది. ప్రతిరోజూ కేజీహెచ్‌కు కనీసం మూడు నుంచి ఐదు బ్రెయిన్ స్ట్రోక్ కేసులు వస్తుంటాయి. వీరిలో సమయానికి రాలేకపోయిన వారే ఎక్కువ. వారికి ఈ ఇంజక్షన్ ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతోంది. కొందరికి బ్లీడింగ్ కావడంతో ఇవ్వలేకపోతున్నామని వైద్యులు చెబుతున్నారు. సకాలంలో తీసుకువచ్చిన వారికి క్యాజువాల్టీలోనే ఇంజక్షన్ ఇచ్చే ఏర్పాట్లు చేశామని న్యూరాలజీ విభాగాధిపతి గోపి పేర్కొన్నారు. కేజీహెచ్‌లో ప్రత్యేకంగా స్ట్రోక్ యూనిట్ ఏర్పాటు చేశామని, ఈ ఇంజక్షన్ ఇచ్చిన తరువాత ఫాలో అప్ ట్రీట్‌మెంట్ కూడా అందిస్తున్నామన్నారు.

విమ్స్‌లో గత ఏడాది నుంచి ఇంజక్షన్ అందిస్తున్నామని డైరెక్టర్ రాంబాబు వెల్లడించారు. ప్రాణాపాయ స్థితిలో, కనీసం సరిగా చూడలేని పరిస్థితుల్లో వచ్చిన ఎంతో మంది రోగులు మూడు, నాలుగు గంటల్లో సాధారణ స్థితికి చేరుకుంటున్నారన్నారు. స్ట్రోక్ వచ్చిన వెంటనే ఆస్పత్రికి తీసుకురావడం కీలకమని గుర్తించాలని చెబుతున్నారు.

అత్యున్నత ప్రమాణాలే దేశాభివృద్ధికి కీలకం

» బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ డీడీ మీనాక్షి గణేషన్



మీనాక్షి గణేషన్‌ను సత్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, ఇతర ప్రొఫెసర్లు

విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అత్యున్నత ప్రమాణాలతో ఉత్పత్తుల తయారీ దేశాభివృద్ధిలో కీలకంగా నిలుస్తుందని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (సౌత్) మీనాక్షి గణేషన్ పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఇంజనీరింగ్ కళాశాలతో బీఐఎస్ నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ 'స్టాండర్డైజేషన్ అండ్ కన్ఫర్మిటీ అసెస్‌మెంట్'ను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్థకు, వ్యవస్థకు శక్తినిచ్చేవి ప్రమాణాలేనన్నారు. శిక్షణలో భాగంగా అధ్యాపకులకు భారతీయ, అంతర్జాతీయ ప్రమాణాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం 2023లో బీఐఎస్‌తో అవగాహన ఒప్పందం చేసుకుని విభిన్న కార్యక్రమాలను, పరిశోధనా ప్రాజెక్టులను నిర్వహిస్తోందన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను జాతికి అందిస్తోందని, ప్రొఫెసర్లకు విభిన్న అంశాలపై బీఐఎస్ నిపుణులు విస్తృత అవగాహన కల్పిస్తారన్నారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు, బీఐఎస్ కలిసి పనిచేయడం ఎఫ్‌డీపీ ప్రత్యేకతన్నారు. ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రోగ్రామ్‌లోని అంశాలను కరికులంలో భాగం చేయాలన్నారు.ఇంజనీరింగ్ అంశాలకు ప్రమాణాలు (స్టాండర్డ్స్) అవసరమన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శశి భూషణరావు మాట్లాడుతూ శతాబ్ది సంవత్సరంలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం శుభపరిణామమన్నారు. మూడు విభాగాల్లో బీఐఎస్ విద్యార్థి శాఖలున్నాయని, మరో శాఖను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమం సమన్వయకర్త ప్రొఫెసర్ సీఎస్‌వీ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ బీఐఎస్ సమాచారం, పుస్తకాలతో గ్రంథాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి 120 మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారన్నారు. బీఐఎస్ శాస్త్రవేత్త ఎంఏజే వినోద్ పాల్గొన్నారు.

22న కానిస్టేబుల్ అభ్యర్థులు హాజరుకావాలి

విశాలాక్షినగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సివిల్, ఏపీఎస్పీ ఉద్యోగాలకు ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులు ఈనెల 22న కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు పరేడ్ మైదానం వద్ద హాజరుకావాలని అనకాపల్లి ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. సెలక్షన్స్ సమయంలో సమర్పించిన ఒరిజినల్ సర్టిఫికెట్స్, గజిటెడ్ అధికారితో సంతకం చేయించిన మూడు సెట్ల జెరాక్స్ కాపీలు, మూడు కలర్ ఫొటోలతో ఉదయం ఏడు గంటలకే రావాలన్నారు.

మధురానుభూతిని పంచేలా ఫొటో ప్రదర్శన

» పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్
» విశాఖ మ్యూజియంలో ప్రారంభమైన ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, పంచకర్ల రమేష్ బాబు, విజయ్‌కుమార్ తదితరులు

బీచ్‌రోడ్డు, ఆగస్టు 19, (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఎదుర్కొంటున్న అనేక రుగ్మతలు, మార్పు, నివారణ మార్గాలను చూపగలిగే అద్భుత ఛాయాచిత్ర రూప కల్పన ఫొటో అని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆర్కే బీచ్ వద్ద ఉన్న విశాఖ మ్యూజియంలోవైజాగ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అలనాటి మధుర జ్ఞాపకాలు, సంతోషం, భావ వ్యక్తీకరణ, ప్రకృతిలో మార్పులను ఫొటోగ్రాఫర్లు తమ కెమెరాల్లో బంధించి ప్రజా బాహుళ్యానికి అందిస్తారన్నారు. నగరాభివృద్ధికి సంబంధించిన ఫొటోలతో పాటు, సమస్యలను ప్రతిబింబించేలా, అనేక విజయాలకు గుర్తుగా తీసిన ఫొటోలను ప్రదర్శనలో ఉంచడం మధురానుభూతి అని అన్నారు. అంతకుముందు ప్రదర్శనను జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ప్రారంభించారు. అనంతరం విజయవాడలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో గెలుపొందిన ఫొటో జర్నలిస్టులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలి

» సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్



జగదాంబ జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న వామపక్ష నాయకులు, కార్మికులు

మహారాణిపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో 44 విభాగాలకు బిడ్లు ఆహ్వానించడం ముమ్మాటికీ ప్రైవేటీకరణ చర్య అని, దీనిని వెంటనే రద్దు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. మంగళవారం జగదాంబ జంక్షన్‌లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు. 'విశాఖ ఉక్కును అగ్రగామి సంస్థగా నిలుపుతాం.. ఇది మా ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం.. ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడం మా ప్రభుత్వ ఘనత' అని ప్రకటించిన చంద్రబాబు, పవనకల్యాణ్‌ల వ్యాఖ్యలను ఉటంకిస్తూ ఇప్పుడు జరుగుతున్నదేమిటని ప్రశ్నించారు. కార్మికులను, ప్రజలను మభ్యపెట్టి ప్లాంట్ ప్రైవేటీకరణను వేగవంతం చేసే చర్యలన్న ఆరోపణలు నేడు నిరూపి తమవుతున్నాయన్నారు. అనంతరం కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను 41 ముక్కలుగా చేసి కార్పొరేట్లకు కట్టబెట్టడానికి సిద్ధ పడుతూ సుమారు 7 వేల మంది కాంట్రాక్ట్, శాశ్వత ఉద్యోగులను ఇంటికి పంపిస్తే ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్‌లు స్పందించకపోవడం దారుణమన్నారు. వారు కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికుల తొలగింపు, ఈవోఐ ఆపకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, పి.మణి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలంలో 22న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

» ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి: ఈవో



పేర్లు నమోదుచేయించుకుంటున్న మహిళలు

సింహాచలం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా ఈనెల 22న సింహగిరి వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తామని ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. ఇందులో పాల్గొనే మహిళలు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ మేరకు ఏఈఓ పంతం శ్రీనివాస్, పర్యవేక్షణాధికారి సీవీవీ పద్మనాభరాజు పేర్ల నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఆధార్‌కార్డు చూపించి, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. భక్తుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ఉదయం 7, 9, 11 గంటలకు మూడు స్లాట్లుగా విభజించి వ్రతాలు నిర్వహిస్తావున్నారు. దేవస్థానం బస్సుల్లో ఉచిత రవాణాతో పాటు పూజా సామగ్రి, ప్రసాదం, ఉచిత దర్శనం, అన్నప్రసాదం భక్తులకు అందజేస్తారు.

ఘనంగా ఎన్‌ఎస్‌టీఎల్ వ్యవస్థాపక దినోత్సవం



ప్రిడక్షన్ సాఫ్ట్‌వేర్ నిర్వాణను ఆవిష్కరిస్తున్న అతిథులు

గోపాలపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) ప్రీమియర్ నేవల్ రిసెర్ఫ్ లేబొరేటరీ ఎన్‌ఎస్‌టీఎల్ 56వ వ్యవస్థాపక దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఎన్‌ఎస్‌టీఎల్‌లోని మానసి ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్, గౌరవ అతిథి నేవల్ సిస్టమ్స్ అండర్ మెటీరియల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్.వి.హరప్రసాద్, విశిష్ట అతిథి రియల్ అడ్మిరల్ అరవింద్ రావల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎన్‌ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమీర్ వి కామత్ మాట్లాడుతూ ప్రపంచ భౌగోళిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ప్రపంచ స్థాయి నావికా ఉత్పత్తులకు ఎన్‌ఎస్‌టీఎల్ మార్గదర్శకత్వం వహించాలన్నారు. నిర్దేశిత వ్యవస్థలను త్వరితగతిన అభివృద్ధి చేయడం ద్వారా 2047 నాటికి సాంకేతిక రంగంలో అగ్రగామిగా నిలవాలనే ఆశాభావం వ్యక్తం చేశారు. 56 ఏళ్ల ప్రయాణం పూర్తిచేసుకున్న సందర్భంగా ఎన్‌ఎస్‌టీఎల్ బృందానికి అభినందనలు తెలిపారు. హరప్రసాద్ మాట్లాడుతూ నీటి అడుగున ఆయుధాలు, వ్యవస్థల రూపకల్పన, అభివృద్ధిలో ఎన్‌ఎస్‌టీఎల్ నైపుణ్యం సాధించిందన్నారు. భారత నావికాదళాన్ని సంతృప్తి పరచడంలో సరైన దిశలో ప్రయాణం సాగిస్తోందన్నారు. అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ భారత నావికాదళం అవసరాలకు అనుగుణంగా ఆయుధాల అభివృద్ధిలో ఆత్మ నిర్భరతను సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. కేవలం పది మంది సిబ్బందితో 1969లో స్థాపించబడిన ఎన్‌ఎస్‌టీఎల్ ప్రస్తుతం 184 మంది శాస్త్రవేత్తలు, 662 మంది సిబ్బందితో రక్షణ పరిశోధన అభివృద్ధికి గణనీయమైన కృషి చేస్తోందన్నారు. ఈ ఏడాదిలో సాధించిన సాంకేతిక విజయాలను వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ వీకే పట్నాయక్ ఎల్ఆర్‌డీసీ కార్యక్రమాలను తెలిపారు. వర్క్స్ కమిటీ చేపట్టిన కార్యకలాపాలతో కూడిన వార్షిక నివేదికను వర్క్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ హెచ్.ఎన్. దాస్ వివరించారు. ఈ సందర్భంగా వరుణాస్త్ర కోసం బెలూన్ రికవరీ సిస్టమ్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ టెక్నాలజీ (సాంకేతిక బదిలీ)ను డాక్టర్ సమీర్ వి కామత్ చేతులమీదుగా భారత డైనమిక్స్ లిమిటెడ్ డైరెక్టర్ పీవీ రాజారామ్‌కు, ఎన్‌ఎస్‌టీఎల్ అభివృద్ధి చేసిన హైబ్రిడ్ జీటీ-ఐఆర్‌ఎస్‌ఎస్‌ను రియల్ అడ్మిరల్ అరవింద్ రావల్‌కు అందజేశారు. అనంతరం స్వదేశీ ఆర్‌సీఎస్ (రాడార్ క్రాస్ సెక్షన్) ప్రిడక్షన్ సాఫ్ట్‌వేర్ నిర్వాణను ఆవిష్కరించారు. హిందీ మ్యాగజైన్ మంథన్ 9వ సంచికను విడుదల చేశారు. 25 సంవత్సరాల సేవాకాలాన్ని పూర్తిచేసుకున్న అధికారులు, సిబ్బందిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీతః యూనియన్ అధ్యక్షుడు ఆకిరి సునీల్, వర్క్స్ కమిటీ కార్యదర్శి జి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

రైలు ఢీ కొని వృద్ధుడి మృతి

గోపాలపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీ కొని ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఈ సంఘటన కొత్తపాలెం అండర్‌పాస్‌వే వద్ద జరిగింది. అండర్ పాస్‌వే ట్రాక్‌పైన మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించిన రైల్వే సిబ్బంది జీఆర్‌పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. జీఆర్‌పీ ఎస్‌ఐ రామారావు మృతదేహాన్ని పరిశీలించారు. ఆధారాలు లభించలేదు. అదే సమయం లో నాగేంద్రకాలనీ వాసులు మృతుడు నంబూరి చంద్రశేఖరరావు(73)గా గుర్తించడంతో అతడి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వృద్ధాప్యంతో వినికిడి లోపం తలెత్తిందని, మూత్రవిసర్జనకు వచ్చిన సమయంలో ప్రమాదం జరిగి ఉంటుందని కుటుంబసభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సీతంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దొండపర్తికి చెందిన ఓ వ్యక్తి మద్యపానం, చెడు అలవాట్లకు బానిస కావడం, వైవాహిక జీవితంలో వివాదాల కారణంగా ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డైమండ్ పార్కు సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో సీహెచ్ రాము వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అతడి చిన్న కుమారుడు దుర్గాప్రసాద్ (30)కు వివాహమైంది. రెండేళ్లుగా భార్యతో వివాదాలతో విరక్తి చెందాడు. దీంతో మద్యానికి, చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. దీంతో మానసికంగా కుంగిపోయి సోమవారం అర్ధరాత్రి దాటాక బాత్‌రూమ్‌లో పైకప్పునకు చున్నీతో ఉరివేసుకున్నాడు. ఉదయం లేచి చూసిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఉమాకాంత్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు.

లభించని మత్స్యకారుడి ఆచూకీ

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల క్రితం సముద్రంలో గల్లంతైన మత్స్యకారుడు పిల్లా సతీష్(24) ఆచూకీ దొరకలేదు. మత్స్యకారులు బోటులో సముద్రంలోకి వెళ్లి వెతికినా జాడ లేకపోవడంతో కుటుంబం రోదిస్తోంది. జాలరి ఎండాడకు చెందిన సతీష్ ఆదివారం ఉదయం వేటకు వెళ్లాడు. వాయుగుండం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా ఉండడడంతో వల వెనక్కు లాగడంతో పాటు, బలమైన కెరటాలు రావడంతో కొట్టుకుపోయాడు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.30 వేల విలువైన ఆరు కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ప్లాట్ ఫామ్‌లపై తనిఖీలు చేస్తున్న సమయంలో తమిళనాడుకు చెందిన అరుణ్‌కుమార్ (21) గంజాయి రవాణా చేస్తుండగా పట్టుబడ్డాడు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

108 డిఫెన్స్ మద్యం సీసాలు స్వాధీనం

» ఇద్దరిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎక్సైజ్ పోలీసులు

గాజువాక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డిఫెన్స్ మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలావున్నాయి. గాజువాకలో డిఫెన్స్ మద్యం అక్రమంగా తరలిపోతోందనే సమాచరాతో టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం పెదగంట్యాడ ఫైర్‌స్టేషన్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానితుడు నరసింహారెడ్డిని అదుపులకి తీసుకుని 15 డిఫెన్స్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించి, గాజువాకలోని జిలకర్ర సుబ్బారావు ఫర్నిచర్ షాప్‌లో దాడులు చేయగా 48 సీసాలు, అతని గొడౌన్‌లో 45 మద్యం సీసాలు లభ్యమయ్యాయి. అతడికి ఎక్కడినుంచి వస్తున్నాయో ఆరా తీయగా ఫర్నిచర్ దుకాణానికి వచ్చే నేవీ సిబ్బంది ఇస్తున్నారని తేలింది. మొత్తం 108 మద్యం సీసాలు, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ తెలిపారు. దాడుల్లో సీఐ రవికిరణ్, ఎస్‌ఐ మునిలినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.


పాలిటెక్నిక్ కళాశాలలో రష్యా ప్రతినిధులు



కళాశాల ప్రాంగణంలో రష్యన్ ప్రతినిధుల బృందం

కంచరపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రష్యా దేశానికి చెందిన 12మంది ప్రతినిధుల బృందం మంగళవారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించింది. సాంకేతిక విద్య, నైపుణ్య అభివృద్ధి పరంగా ఇరుదేశాల మధ్య సహకారం కుదుర్చుకునే ప్రక్రియలో భాగంగా పర్యటించారు. మెటలర్జీ, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ తదితర విభాగాలకు తరగతి గదులు, లేబొరేటరీలను పరిశీలించారు. నూతన సాంకేతికత, పరికరాల వినియోగం, బోధనా పద్ధతులను తెలుసుకున్నారు. అనంతరం అధ్యాపకులతో పాఠ్య ప్రణాళిక, విద్యా విధానం, పాఠ్యాంశాలు, మూల్యాంకనా విధానాలపై చర్చించారు. భారత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులైన విద్యార్థులకు రష్యాలో శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సన్నద్ధంగా ఉన్నామన్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.కె.రత్నకుమార్ ఆధ్వర్యంలో విభాగాధిపతులు డా.పీఎం.బాషా, జె.గోవర్ధన్, డా.ఎం.నారాయణరావు, వి.సంధ్యారాణి, డా.ఫణికృష్ణ, ఎస్.వి.రమణ తదితరుల బృందానికి కళాశాలలో బోధనా విధానం, అందుబాటులో ఉన్న మౌలిక వసతులను వివరించారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యమి వికాస్ మహోత్సవం



ఉద్యమ వికాస్ మహోత్సవంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు

మహారాణిపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యమి వికాస్ మహోత్సవం సందర్భంగా విశాఖ జోన్‌లో మంగళవారం ఎగుమతి, దిగుమతిదారుల సమావేశం నిర్వహించారు ఎంఎస్‌ఎంఈ కస్టమర్ అవుట్ రీచ్ ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఎగుమతి దిగుమతి దారుల మధ్య వృద్ధి ఆవిష్కరణ సహకారం వేదిక కల్పించారు, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ బి.కుమార్ మాట్లాడు తూ ఎంఎస్‌ఎంఈ దిగుమతి కస్టమర్లకు రూ.200 కోట్ల విలువైన రుణ మంజూరు పత్రాలు అందజేశామన్నారు. ఈ వేదిక ద్వారా నెట్‌వర్కింగ్ అవకాశాలు పెరిగి, కొత్త వ్యాపార అవకాశాలు, భాగస్వాముల అన్వేషణకు అవకాశం లభించిందన్నారు. ఎంఎస్‌ఎంఈ రంగానికి మద్దతుగా ప్రాంతీయ ఆర్థిక వృద్ధి పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో నికేష్ కుమార్ సిన్హా, సీతారామ్ నిట్టల, జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.